ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

గురువారం 4 ఏప్రిల్ 2024





ఛీర్‌గర్ల్స్ సందడి



నరేన్ 85/39

రఘువంశీ 54/27

చెలరేగిన కోల్‌కతా నైట్‌రైడర్స్

ఢిల్లీ క్యాపిటల్స్‌పై 106 పరుగుల తేడాతో విజయం

- శివమెత్తిన సునీల్ నరైన్
- తొలిమ్యాచ్‌లో అర్ధ సెంచరీతో రాణించిన రఘువంశీ
- స్టేడియంలో షారుక్ ఖాన్ సందడి



ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో కిక్కిరిసిన జనం

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 3: కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు బ్యాట్స్‌మెన్ బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఏసీఏ-వీడీసీఏ స్టేడియాన్ని సిక్సర్లు, బౌండరీలతో హోరెత్తించారు. దీంతో కోల్‌కతా నైట్ రైడర్స్ 106 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 272 పరుగులు భారీస్కోరు చేసింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్, సునీల్ నరైన్ రెండో ఓవర్ నుంచే రెచ్చిపోయారు. దీంతో 4.1 ఓవర్లలోనే జట్టు స్కోరు 50 పరుగులకు చేరింది. ధాటిగా ఆడిన నరైన్ కేవలం 21 బంతుల్లో ఆరు బౌండరీలు, నాలుగు సిక్సర్లతో ... మిగతా 6వ పేజీలో



రిషబ్ పంత్ బ్యాటింగ్ విన్యాసం

రిషబ్ పంత్ 55/25



స్టేడియంలో షారుఖ్‌ఖాన్

- మరిన్ని ఫొటోలు I పేజీలో

పెన్షన్ల పంపిణీలో జాప్యం

ఉద్దేశపూర్వకంగానే...

మధ్యాహ్నం 3 గంటల తరువాత బ్యాంకుల నుంచి డ్రా

- వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దే పంపిణీ ప్రకటనలకే పరిమితం
- పండు ముసలోళ్లు సైతం సచివాలయాలకు రాక
- అక్కడ కూడా అరకొరగానే సిబ్బంది

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల పంపిణీని కావాలనే జాప్యం చేస్తోంది. లబ్ధిదారులంతా ఇబ్బంది పడాలని, దానికి తెలుగుదేశమే కారణమని భావించేలా వ్యవహరిస్తోంది. ఈ ఉద్దేశంతోనే గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీకి పరిమిత సిబ్బందిని కేటాయించింది. మిగిలిన వారంతా ఇతర వ్యవహారాల్లో బిజీగా ఉన్నారని చెబుతోంది. జిల్లా అధికారులు కూడా పింఛన్ల పంపిణీ సక్రమంగా జరగాలనే చెబుతున్నారు గానీ త్వరగా పూర్తిచేయాలని ఒత్తిడి పెట్టడం లేదు. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది తొలిరోజు (బుధవారం) తీవ్ర జాప్యం చేశారు.



పెదవాల్తేరు జాలారిపేట వద్ద బయోమెట్రిక్ విధానంలో పెన్షన్లు అందజేస్తున్న సచివాలయం సిబ్బంది

వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాలకు రానవసరం లేదని, వారికి ఇంటి వద్దకే వచ్చి పింఛన్ల మొత్తం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కనీసం ఈ విషయం పింఛన్‌దారులకు తెలిసేలా ప్రచారం కూడా నిర్వహించలేదు. దాంతో పండు ముదుసళ్లు కూడా ఊతకర్ర చేతపట్టుకొని, ఎవరినో ఒకరిని తోడు తీసుకుని సచివాలయాలకు వచ్చారు. బ్యాంకుల్లో డబ్బులు డ్రా చేసి, బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఈ విషయం కూడా వారికి చేరవేయలేదు. దాంతో వారంతా ఉదయం పది గంటలకే సచివాలయాలకు వచ్చి కూర్చున్నారు. అక్కడ కూడా తగిన ఏర్పాట్లు లేవు. కేవలం నలుగురు కూర్చోడానికే కుర్చీలు వేశారు. మిగిలిన వారంతా నిల్చోవాల్సి వచ్చింది. జిల్లాలో తొలిరోజు పింఛన్ల పంపిణీ చాలా మందకొడిగా సాగింది. చాలా సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ బాధ్యతలు తీసుకున్న సిబ్బంది తప్పితే మిగిలినవారు ఎవరూ కనిపించకపోవడం గమనార్హం.



పాత రేసపువానిపాలెంలో పింఛనుదారులకు ఫొటోలు తీస్తున్న సిబ్బంది

వారంతా ఎక్కడ?

సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ బాధ్యత వీఆర్‌ఓ, వెల్ఫేర్ సెక్రటరీలకు అప్పగించారు. వాస్తవానికి ఆయా కార్యాలయాల్లో ఇంకా చాలామంది ఉద్యోగులు ఉన్నారు. ఎడ్యుకేషన్ అండ్ డేటా ... మిగతా 6వ పేజీలో

ఏయూలోనే ఎందుకిలా...

విద్యార్థులపై ఎడాపెడా వడ్డన

- మెస్ చార్జీల కింద అదనంగా రూ.1,500 నుంచి రూ.2 వేల వరకూ వసూలు
- ఇంజనీరింగ్, లా కాలేజీ హాస్టళ్ల విద్యార్థులపై బాదుడు
- విద్యుత్ బిల్లు కింద నెలకు రూ.300 నుంచి రూ.500
- హాస్టల్ గదిలో ఫ్యాన్, లైటు ఏది పోయినా విద్యార్థులు భరించాల్సిందే
- సాయంత్రం బయటకు వెళ్లి ఆలస్యంగా వస్తే ఫైన్
- తొమ్మిది గంటలలోపు వస్తే రూ.100
- 9 గంటలు దాటితే రూ.500
- భోజనం నాణ్యత అంతంతమాత్రమే
- పురుగులు వస్తున్నాయంటున్న విద్యార్థులు
- పట్టని ఉన్నతాధికారులు



ధర్నా చేస్తున్న విద్యార్థినులు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మెస్ చార్జీలను విపరీతంగా పెంచేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్కో విద్యార్థి నుంచి కనీసం వెయ్యి నుంచి రూ.2 వేలు అదనంగా వసూలు చేస్తున్నారు. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల నుంచి మెస్ చార్జీల కింద నెలకు రూ.2,700 నుంచి రూ.3,600 వరకూ వసూలు చేయాలి. ఇది సదరు విద్యార్థి ఉంటున్న హాస్టల్ (మెనూ)ను బట్టి ఉంటుంది. అయితే ఇంజనీరింగ్, లా కాలేజీల హాస్టళ్లలో ఉండే విద్యార్థుల నుంచి కనీసం రూ.5 వేలు తీసుకుంటు న్నారు. అంటే ఒక్కో విద్యార్థి నుంచి రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులందరికీ సాధారణంగా మెస్ బిల్లు ఒకే విధంగా రావాలి. కానీ, ఏయూలో ఒక్కో విద్యార్థి నుంచి ఒక్కోరకంగా వసూలు చేస్తున్నారని విద్యార్థి సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. విద్యార్థులు చెల్లించే డబ్బులకు రశీదులు కూడా ఇవ్వడం లేదు. బుక్‌లో పెన్సిళ్లతో రాస్తున్నారని, దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే వార్డెన్లు వేధింపులకు గురిచేస్తున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఆయా హాస్టళ్లలో సుమారు వేయి మంది వరకు విద్యార్థులు ఉంటున్నారు.

అదనపు బాదుడు ఎంతో....

మెస్ చార్జీలతోపాటు హాస్టళ్లలో ఫ్యాన్, లైట్..ఏది పోయినా ఆ గదుల్లో ఉండే విద్యార్థులే భరించాల్సి వస్తోంది. ప్రతినెలా కరెంట్ బిల్లును విద్యార్థుల నుంచే వసూలు చేస్తున్నారు. ఒక్కో విద్యార్థి నుంచి కరెంట్ బిల్లు పేరుతో రూ.300 నుంచి రూ.500 వసూలు చేస్తున్నారు. అలాగే కొన్ని హాస్టళ్లలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటుచేశారు. వీటి నిర్వహణ పేరుతో ఒక్కొక్కరి నుంచి నెలకు రూ.50 నుంచి రూ.100 వసూలు చేస్తున్నారు.

ఫైన్ పేరుతో అదనంగా వసూలు

ప్రతినెలా మెస్ చార్జీలను చెల్లించాల్సిందిగా హాస్టల్ వార్డెన్లు నోటీసు బోర్డులో సర్క్యులర్‌ను పెట్టాలి. కానీ, ఆ విధంగా చేయడం లేదు. నెల పూర్తయి అదనంగా పది రోజులు దాటిన తరువాత మెస్ చార్జీలు చెల్లించాలంటూ విద్యార్థులకు సమాచారాన్ని ఇస్తున్నారు. ఆలస్యమైన రోజులకుగాను అపరాధ రుసుము వసూలు చేస్తున్నారు. రోజుకు రూ.100 చొప్పున విద్యార్థుల నుంచి పిండేస్తున్నారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే...వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

తొమ్మిది దాటి వస్తే రూ.500 చెల్లించాల్సిందే

వుమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్‌లో అయితే వార్డెన్ వ్యవహారశైలి భిన్నంగా ఉంటోంది. సాయంత్రం విద్యార్థినులు బయటకు వెళ్లి రావడం ఆలస్యమైతే జరిమానా విధిస్తున్నారు. ఏడు నుంచి తొమ్మిది గంటలలోపు విద్యార్థులు హాస్టల్‌కు వస్తే రూ.100 ఫైన్‌గా చెల్లించాలి. అదే తొమ్మిది దాటితే రూ.500 చొప్పున ఫైన్ చెల్లించాల్సి ... మిగతా 6వ పేజీలో

వుడా లేఅవుట్ అన్యాక్రాంతం!

- అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ప్లాట్ల కొనుగోలుదారులు
- స్పందించని అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



మధురవాడలో స్థలాన్ని కబ్జా చేసి వేసిన బోరు

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మొద్దు నిద్ర చూసి పలువురు విలువైన భూముల కబ్జాకు తెర తీశారు. ఇది ఎన్నికల సమయం కావడంతో రాత్రికి రాత్రి భూములు కబ్జా చేయాలని పలువురు యత్నిస్తున్నారు. మధురవాడ సర్వే నంబర్లు 127/9, 11, 15లలో 17.7 ఎకరాల భూమిని వుడా 2011లో ల్యాండ్ పూలింగ్‌లో తీసుకొని లేఅవుట్ (ఎల్‌పీ నంబరు 23/2011) వేసింది. అందులో 9.46 ఎకరాల్లో 164 ప్లాట్లు వేసి వేలం ద్వారా విక్రయించింది. కొన్నింటిని భూములు ఇచ్చిన రైతులకు కేటాయించింది. ఈ లేఅవుట్‌లో ఆదిత్య హడ్కో కంపెనీకి కొంత భూమిని విక్రయించింది. దానిని ఆనుకొని ఉన్న ప్లాట్లపై కొందరు కన్నేశారు. వుడా ల్యాండ్ పూలింగ్‌లో భూమిని సేకరించకముందే తాము వాటిని డీపట్టాదారుల నుంచి కొన్నామంటూ రెండేళ్ల క్రితం ఆ భూముల్లోకి ప్రవేశించారు. లేఅవుట్ వేసినప్పుడు కోర్టును ఆశ్రయిస్తే, పరిశీలించాలని వుడాను ఆదేశించిందని పత్రాలు చూపుతూ కొన్ని ప్లాట్లను ఆక్రమించే ప్రయత్నం చేశారు. వెంటనే ఆ ప్లాట్ల హక్కుదారులు స్థానిక పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇద్దరు వ్యక్తులు తమ భూముల్లోకి వచ్చి ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు చేయగా 502/2021 నంబరుతో ఎఫ్ఐఆర్ ... మిగతా 6వ పేజీలో

ఆ బిల్లు కాస్త కట్టేయండి

సీఐలపై ఉన్నతాధికారుల భారం

- హోటల్ బిల్లులు, ఫంక్షన్‌ల ఖర్చులు...
- ఇంట్లో ఫర్నిచర్ కొనుగోలు చేసినా బిల్లు స్టేషన్ అధికారులకు పంపుతున్న కొంతమంది అధికారులు
- జోన్-2 పరిధిలోని అధికారి అయితే తరచూ సీఐలకు ఇండెంట్‌లు
- సమకూర్చకపోతే ఏదో సాకుతో వేధింపులు
- ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని విమర్శలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో కొంతమంది పోలీస్ అధికారుల తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హోటల్ బిల్లులు, ఇళ్లలో జరుపుకునే పార్టీల ఖర్చు కూడా కొందరు...తమ పరిధిలో సీఐలపై మోపుతున్నారు. కమిషనరేట్‌లో కీలకమైన పోస్టులో ఉన్న అధికారి అయితే తన ఇంట్లో ఇటీవల కొనుగోలు చేసిన ఫర్నీచర్ బిల్లును ఒక సీఐకు పంపించినట్టు తెలిసింది.

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో అదనపు డీజీపీ క్యాడర్ కలిగిన సీనియర్ అధికారి సీపీగా పనిచేస్తున్నారు. ఆయనకు సహకరించేందుకు వీలుగా మరికొందరు ఐపీఎస్ అధికారులు, నాన్‌కేడర్ ఐపీఎస్‌లు, అదనపు ఎస్పీలు, ఏసీపీ స్థాయి అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఉన్నతమైన పోస్టింగ్‌లో ఉన్నవారికి భారీగా జీతంతోపాటు అలవెన్సులు, ఇతర సదుపాయాలు లభిస్తాయి. అయినప్పటికీ కొంతమంది కుటుంబంతో, స్నేహితులతో హోటల్‌కు వెళ్లినప్పుడు, కుటుంబంలో నిర్వహించుకునే వేడుకలకు అయ్యే ఖర్చును సీఐలపైనే



మోపుతున్నారనే విమర్శలు పోలీస్ శాఖలో వెల్లువెత్తుతున్నాయి. జోన్-2 పరిధిలోని ఒక ఏసీపీ స్థాయి అధికారి తన పరిధిలోని స్టేషన్లకు వచ్చే ప్రతి సివిల్ కేసును తన దృష్టిలో పెట్టాలని సీఐలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాంటి కేసులు వచ్చినప్పుడు సీఐలు సదరు ఏసీపీకి చెబితే ఇరువర్గాలతో మాట్లాడి ఆయన భారీగా సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్టేషన్‌కు వచ్చిన ఒక ఫిర్యాదుదారుడికి ఫేవర్ చేస్తానని చెప్పి అతనితో ఇంట్లోకి ఇన్వర్టర్ కొనిపించుకుని, మళ్లీ ఆ బిల్లు ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు)	6.14
సహరి (శుక్ర)	4.32

మత్స్యకారులు సురక్షితం...

- అప్పికొండ తీరానికి చేరిక

- వార్త II పేజీలో

పాడేరు ఘాట్‌లో ఘోరం

- అదుపుతప్పి లోయలోకి బోల్తాపడిన బొలేరో... ఇద్దరు మృతి, 30 మందికి గాయాలు

-6లో



పింఛన్లపై వైసీపీ రాజకీయం!

ఎన్ఏడీ జంక్షన్, ఏప్రిల్ 3: నగరంలోని బాజీ జంక్షన్ సుసర్ల కాలనీలో గల 470, 471 సచివాలయాల్లో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభం అయ్యింది. అయితే ఒకవైపు సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తుండగా, మరోవైపు కొందరు వైసీపీ కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకుని జగన్‌కు అనుకూలంగా, చంద్రబాబునాయుడుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయినా అధికారులు ఎవరూ వారించకపోవడం ఆశ్చర్యపరచింది. కాగా, పింఛన్ల పంపిణీ సాఫీగా సాగుతుంటే అధికార పార్టీ కార్యకర్తలు రాజకీయం చేయడంపై లబ్ధిదారులే అసహనం వ్యక్తంచేశారు.

సాయి ధ్యానమందిరంలో 9న ఉగాది ఉత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 3 : గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో ఈ నెల 9వ తేదీన ఉగాది, 17వ తేదీన శ్రీరామ నవమి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరి రావు తెలిపారు. ఈమేరకు బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు.

టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిల కో ఆర్డినేటర్‌గా పరదేశీయాదవ్



పరదేశీయాదవ్

మహారాణిపేట, ఏప్రిల్ 3: విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిల కో ఆర్డినేటర్‌గా బొట్టా పరదేశీ యాదవ్ నియమితులయ్యారు. పార్టీ సెంట్రల్ బీసీ కమిటీ అధి కారికంగా విశాఖలో నియోజక వర్గాల క్లస్టర్ ఇన్‌చార్జిలు, కో ఆర్డినే టర్లను ప్రకటించింది. దక్షిణం కో ఆర్డినేటర్‌గా టీడీపీ బీసీ కమిటీ కార్యదర్శి బొట్టా పరదేశీ యాదవ్ అధిష్టానం ప్రకటించింది. ఈ సంద ర్భంగా పరదేశీ మాట్లాడుతూ క్లస్టర్ ఇన్‌చార్జిలు బూత్ ఇన్‌చార్జిలతో కలసి వంశీ కృష్ణ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు.

స్వర్ణకారులకు రుణాలు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 3: స్వర్ణకారులకు రుణాలు మంజూరు చేసి బ్యాంకు ఆఫ్ ఇండియా విశాఖ జోనల్ ఆదుకోవడం అభినందనీయమని రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ అన్నారు. ముద్ర రుణాల ద్వారా స్వర్ణకారులకు ముడి బంగారం వస్తువులు తయారీకి రుణాలను మంజూరు చేసి వారి కుటుంబ పోషణకు బ్యాంకు దోహదపడుతుందన్నారు. నగర అధ్యక్షుడు ముదపాక రవి, ప్రధాన కార్యదర్శి పెదపూడి బ్రహ్మం, బ్యాంకు మేనేజర్ బెవరా రామ్మోహన్ పాల్గొన్నారు.



రైల్వేన్యూకాలనీలో పెన్షన్ కోసం వేచి ఉన్న వృద్ధులు



42వ వార్డులోని సచివాలయం తెరవక బయటే ఉన్న పింఛన్‌దారులు

పింఛన్‌దారుల పాట్లు వర్ణనాతీతం

- ఉదయం నుంచి ఎండలో నిరీక్షణ
- మధ్యాహ్నం నగదు రాక.. తర్వాత పంపిణీ

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 3 : గ్రేటర్ 26, 27, 42, 43, 44, 45, 46 వార్డుల పరిధిలోని సచివాలయాల్లో పింఛన్ల కోసం సామాజిక పెన్షన్‌కోసం పింఛన్‌దారులు పడిగాపులు కాశారు. ఆయా ప్రాంతాల్లోని సచివాలయాలకు ఉదయం 9 గంటలకే చేరుకున్నా, కొన్నిచోట్ల తలుపులు పది గంటలైనా తెరుచుకోకపోవడంతో నిరీక్షించాల్సి వచ్చింది. గోడలపైనున్న కార్యదర్శులనెంబర్లకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. కొంతమంది లిఫ్ట్ చేసి సాయంత్రం నాలుగు గంటలకు క్యాష్ వస్తుందని, అప్పటి వరకూ పెన్షన్ పంపిణీ జరగదని సమాధానమిచ్చారు. ఉదయం 11 వరకు క్యాష్ రాకపోవడంతో కొంతమంది పెన్షన్ దారులు నిరాశతో ఇంటి ముఖం పట్టారు. మరి కొంతమంది సచివాలయాల వద్దే నిరీక్షించారు. అక్కయ్యపాలెం, శ్రీనివాసనగర్‌లోని సచివాలయాల్లో మధ్యాహ్నం 2 గంటలకు క్యాష్ రావడంతో సెక్రటరీలు పెన్షన్లు పంపిణీ చేశారు. చిన్నూరు, రైల్వేన్యూకాలనీ తదితర ప్రాంతాల్లోని సచివాలయాల్లో క్యాష్ ఆలస్యంగా రావడంతో పెన్షన్ల పంపిణీ ఆలస్యమైంది. దీంతో పెన్షన్ దారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కూటమి విజయంతోనే అభివృద్ధి : విష్ణుకుమార్‌రాజు



మాట్లాడుతున్న దక్షిణ కూటమి అభ్యర్థి విష్ణుకుమార్ రాజు

మాధవధార, మార్చి 3 ; విశాఖ ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు బుధవారం మురళీనగర్ వాకర్స్ క్లబ్ సీనియరు మెంబర్లను కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నుంచి ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను గెలిపించేలా ఆశీర్వదించాలని మురళీనగర్ సీనియరు సిటిజన్లను అభ్యర్థించారు. రిటైర్డు ఉద్యోగి, వాకర్స్‌క్లబ్ వ్యవస్థాపక సభ్యులు బుచ్చయ్య చౌదరిని కలసి మద్దతు కోరారు. 90ఏళ్లు నిండిన బుచ్చయ్య చౌదరిని ముందుగా సన్మానించిన విష్ణుకుమార్ రాజు ఈ ప్రాంత అభివృద్ధి పాటు రాష్ట్రం సమగ్ర ప్రగతి ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయంతోసాధ్యమవుతుందని అన్నారు. ప్రచారంలో టీడీపీ 50వవార్డు అధ్యక్షులు సనపల.వరప్రసాద్, జనసేన పార్టీ నాయకులు బి.రఘు, బీజేపీ నాయకులు ఉన్నారు.

బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి కృషి

- 'దక్షిణం' కూటమి అభ్యర్థి వంశీ కృష్ణ



ప్రచారంలో వంశీ కృష్ణ

జగదాంబ కూడలి, ఏప్రిల్ 3: దక్షిణ నియోజవర్గంలో బీసీ, ఎస్సీ, మైనారిటీ సామాజికవర్గాల అభ్యున్నతికి పాటుపడతానని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వంశీ కృష్ణ హామీ ఇచ్చారు. గ్రేటర్ 30వ వార్డులో కుమ్మర వీధి పోల మాంబ గుడి వద్ద బుధవారం అమ్మవారికి పూజలు నిర్వహించి పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కుమ్మరవీధి పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, మహిళలు వంశీకి స్వాగతం పలికారు. జెండా చెట్టు, తాడివీధి, సాలిపేట ప్రాంతాల్లో ప్రచారం చేశారు. దక్షిణంలోని సీనియర్ నాయకుడు సీతంరాజు సుధాకర్‌తోపాటు ఆయన వెంట ఉన్న వైసీపీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్ తదితరులు పాల్గొన్నారు. నాంగవంశ సంక్షేమ సంఘం పెద్దలను వార్డు అధ్యక్షుడు డొకర రమణ సమక్షంలో వంశీ కృష్ణ కలిసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు బొచ్చారాము, కొల్లి రమేష్, విల్లూరి చక్రవర్తి, తెలుగు మహిళలు కేదారి లక్ష్మి, మాజీ కార్పొరేటర్ పోలిపిల్లి జ్యోతి, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, ఉరుకూటి నారాయణరావు, జనసేనకు చెందిన వీరమహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



'బీజేపీకి మళ్లీ అధికారమిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారు'

సీతమ్మధార, ఏప్రిల్ 3: కేంద్రంలో మళ్లీ అధికారం ఇస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని బహిరంగ ప్రకటన చేసిన బీజేపీని, రాష్ట్రంలో ఆ పార్టీకి మద్దతు ఇస్తున్న టీడీపీ, జనసేన పార్టీలకు దళితుల మద్దతురానున్న ఎన్నికల్లో ఉండదని విదసం ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు తెలిపారు. రామాటాకీస్ రోడ్డు లో అంబేడ్కర్ భవన్‌లో విదసం రాష్ట్ర సమితి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ళుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ భారత రాజ్యాంగానికి అడుడగునా తూట్లు పొడిచిందన్నారు. ఇప్పుడు 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్నే మార్చేస్తామని ప్రకటించిందని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో ఆదివాసీలపై మత విద్వేషంతో మారణ హోమం సృష్టించి వందల మది మానప్రాణాలను బలి తీసుకవడంతోపాటు దేశంలో ఆదివాసీలు, దళితులు, క్రైస్తవ ముస్లిం మైనారిటీలకు రక్షణ లేదన్నారు. రాజ్యాంగ పీఠికలో లౌకికవాదం అనే పదాన్ని తొలగించి మనువాద దృక్పథంతో దేశాన్ని మతపరమైన రాజ్యంగా మార్చే కుట్ర జరుగుతోందన్నారు. ఈస్థితిలో కాంగ్రెస్ నేతృత్వంలో ఉన్న అతిపెద్ద రాజకీయ లౌకిక కూటమి ఇండియా కూటమిని గెలిపించడం తక్షణ అవసరమని ఉద్ఘాటించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించి 20కి పైగా సంక్షేమ పథకాలకుకోతవేసిందన్నారు. కోడి కత్తి శ్రీను బెయిల్ రద్దు, పథకాల సాధన కోసం విదసం సమరశీల పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. సహాయ కన్వీనర్ సోడదాసి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బల్ల కుమార్, జాజి ఓంకార్, బోడపాటి శామ్యూల్ కుమార్, బూల భాస్కరరావు, గుడాల ఈశ్వరరావు, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు అప్రజాస్వామికం

- ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శీర రమేష్‌కుమార్



నిరసన ర్యాలీగా వెళుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 3: ప్రతిపక్ష పార్టీలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవరిస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శీర రమేష్‌కుమార్ అన్నారు. డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఇండియా కూటమి, భారత్ బచావో, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు క్రేజీవాల్ అరెస్టును నిరసనగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులందరినీ తక్షణమే విడుదల చేసి అసలు నేరస్తులను అరెస్టు చేయాలన్నారు. బీజేపీ కుట్రపూరిత హిందూ ఇజాన్ని చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని మోదీ అసలు రంగు బయటపెట్టాలని విమర్శించారు. కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌ల అరెస్టులకు నిరసనగా ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు డా.సీతల్‌మదాన్, కాంగ్రెస్ నేత ప్రియాంకదండి, సీపీఐ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.



పాడేరు ఘాట్‌లో ఘోరం

- అదుపుతప్పి లోయలోకి బోల్తాపడిన బొలేరో
- ఇద్దరు మృతి, 30 మందికి గాయాలు



క్షతగాత్రులను అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

పాడేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఘాట్‌రోడ్డులో బుధవారం రాత్రి ఘోర ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో కిక్కిరిసిన బొలేరో అదుపుతప్పి లోయలోకి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒక మహిళ (35), పురుషుడు (40) మృతిచెందగా, మరో 30 మంది గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం నుంచి కూలి పనుల కోసం 32 మంది బొలేరో వాహనంలో బుధవారం విజయవాడ బయలుదేరారు. పాడేరు మీదుగా మైదాన ప్రాంతానికి చేరే క్రమంలో రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో స్థానిక ఏసు బొమ్మ మలుపునకు ముందున్న మలుపు వద్ద వాహనం అదుపుతప్పి లోయలోకి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న ఒక మహిళ, మరో పురుషుడు అక్కడికక్కడే మృతిచెందగా, డ్రైవర్‌తో సహా మరో 30 మందికి గాయాలయ్యాయి. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వారు గమనించి బొలేరోలో చిక్కుకున్న వారికి లోయలో నుంచి బయటకు తీశారు. అంబులెన్సులకు సమాచారం ఇచ్చి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఐరాత్రి సమయంలో సంఘటన జరగడంతో మృతులు, క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు.

మరో నలుగురు వలంటీర్ల రాజీనామా

పెందుర్తి, ఏప్రిల్ 3: మండలంలో వాలంటీర్ల రాజీనామా పరంపర కొనసాగుతోంది. బుధవారం రాంపురానికి చెందిన నలుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసేందుకువలంటీర్లు రాజీనామాలు చేస్తున్నారని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో వలంటీర్లు రాజీనామాలు చేసిన వారి సంఖ్య 34 మంది చేరినట్లు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు.

బృందవన పార్కులో పారిశుధ్య పనులు



పార్కులో శుభ్రపరుస్తున్న కార్మికులు

సీతమ్మధార, ఏప్రిల్ 3: జీవీఎంసీ 24వ వార్డు శానిటరీ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది సీతమ్మధార టీపీటీ కాలనీలోని బృందవనపార్కు పారిశుధ్య కార్య క్రమం చేపట్టారు.అధిక సంఖ్యలో పారిశుధ్య సిబ్బందిపాల్గొని పార్కులోచెత్తచెదారంలేకుండా తొల గించారు. పార్కులో వాకర్స్‌హర్షం వ్యక్తం చేశారు.

మాధవధారలో కరెంటు కష్టాలు



సాయంత్రం చీకటిగా మారిన వీధులు

మురళీనగర్, ఏప్రిల్ 3; ఈపీడీసీఎల్ మాధవధార ఎస్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం కరెంటు కష్టాలు ఎదురయ్యాయి. ఇన్ కమింగ్ లేక సబ్‌స్టేషన్‌కే పవర్ కొరత నెలకొంది. సబ్‌స్టేషన్ పరిధి ప్రాంతాలకు దాదాపు 6 గంటల పాటు విద్యుత్ సరఫరా ఆపేశారు. ఎండల కాలంలో మిట్ట మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6.30 నిమిషాల వరకు సరఫరా లేక నివాసితులు అల్లాడిపోయారు. కనీసం ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా కరెంటు సరఫరా నిలిపేయడంతో అటు వ్యాపారాలు దెబ్బతిన్నాయి. ఎండాకాలంలో జోరుగా వ్యాపారాలు చేసే జ్యూస్ సెంటర్లు , సాధారణ వెల్డింగ్ దుకాణాలు, కార్పెంటర్ షాపులు, హోటళ్ల నిర్వాహకులు లబోదిబోమంటున్నారు. ఇళ్లల్లో జనం ఉక్కపోత జనాలు ఇక్కట్లు చవిచూశారు.

చురుగ్గా పోలీసుస్టేషన్ ప్రహరీ నిర్మాణ పనులు



ప్రహరీ నిర్మాణానికి పునాదులు తీసిన దృశ్యం

మురళీనగర్, ఏప్రిల్ 3; గ్రేటర్ 51వవార్డులో ఉన్న ఎయిర్‌పోర్టు జోన్ పోలీసు స్టేషను వద్ద ప్రహరీ, గెడ్డ నీటి ప్రవాహానికి డెక్టు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఎలక్షన్ కోడ్‌కి ముందు రోజే ఇక్కడ పనులను ఆరంభించారు. రూ.39 లక్షల జీవీఎంసీ నిధులు కేటాయించారు. ఎగువ కొండ ప్రాంతంలోని మాధవధార ఉడాకాలనీ, ఎస్.ఆర్.నగర్ ప్రాంతాలు సహా ఆర్టీఏ కార్యాలయం ఎగువ నుంచి చేరుతున్న వర్షం నీరు, కాలువ ప్రవాహాల ముంపు నుంచి రక్షణగా చేపడుతున్న ఈ పనులు మంజూరైనట్టు కార్పొరేటరు రెయ్యివెంకటరమణ తెలిపారు. పోలీసు స్టేషను ఆవరణ నుంచి, ఏసీపీ ఆఫీసు ప్రాంతం దిగువన ఉన్న హైవే రోడ్డు గెడ్డకు పనులను కలుపుతూ నిర్మాణాలు చేపడుతున్నారు. రానున్న వర్షకాలంలోగా పనులు పూర్తిచేస్తామని ఇంజనీరింగ్ విభాగం అధికారులు తెలిపారు.

మత్స్యకారులకు శ్రీభరత్ పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

మహారాణిపేట, ఏప్రిల్ 3: విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లి గల్లంతైన బాధిత మత్స్యకారులను విశాఖ పార్లమెంట్ అభ్యర్థి ఎం శ్రీ భరత్, దక్షిణ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు. ఈ నెల 1వ తేదీన ఫిషింగ్ హార్బర్ జెట్టి నుంచి బోటు మీద చేపల వేటకు వెళ్లిన ఆరుగురు మత్స్యకారులు రెండవ తేదీ నుంచి వారి ఆచూకీ తెలియరాలేదు. దీనితో నేవీ అధికారులు హెలీకాఫ్టర్లతో గాలింపు చర్యలు చేపట్టగా, మత్స్యకారుల అప్పికొండ ప్రాంతంలో క్షేమంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ వారిని పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారులను ఎమ్మెల్యే వాసుపల్లి గణేషకుమార్ పరామర్శించారు.

చెలరేగిన కోల్‌కతా నైట్‌రైడర్స్

... 5వ పేజీ తరువాయి

హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. నరేన్‌కు ఫిల్ సాల్ట్ (18) స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన రఘువన్షీ తోడవ్వడంతో స్కోరు బోర్డు మరింత వేగం పుంజుకుంది. అద్భుతమైన షాట్లతో అలరించిన రఘువన్షీ తన ఐపీఎల్ కెరీర్‌లో తొలి అర్ధ సెంచరీ (54; 3 సిక్సర్లు, 5 బౌండరీలు) సాధించాడు. మరోవైపు కేవలం 39 బంతుల్లో ఏడు బౌండరీలు, ఏడు సిక్సర్లతో 85 పరుగులు చేసిన సునీల్ నరైన్ (85) రెండో వికెట్‌గా అవుటయ్యాడు. ఆ తర్వాత స్థానాల్లో దిగిన ఆండ్రూ రస్సెల్ (41), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (18), రింకూ సింగ్ (26) సిక్సర్లు, బౌండరీలతో విరుచుపడడంతో జట్టు స్కోరు 272 పరుగులకు చేరింది. భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 17.2 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రిషబ్ పంత్ (55), స్టబ్స్ (54) అర్ధ సెంచరీలు సాధించగా, మిగిలిన బ్యాట్స్‌మెన్లు ఘోరంగా విఫలమయ్యారు. కేకేఆర్ బౌలర్లలో వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి తలో మూడు వికెట్లు పడగొట్టగా, మిచెల్ స్టార్క్ రెండు వికెట్లు తీశాడు.

షారుఖ్ ఖాన్ సందడి

గోపాలపట్నం (విశాఖపట్నం), ఏప్రిల్ 3: స్థానిక ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బుధవారం కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య జరిగే ఐపీఎల్ మ్యాచ్‌ను తిలకించడానికి ఆయా జట్ల యజమానులు ప్రత్యేక విమానాల్లో నగరానికి చేరుకున్నారు. ముంబై నుంచి ప్రత్యేక విమానంలో బుధవారం సాయంత్రం ఇక్కడకు విచ్చేసిన బాలీవుడ్ నటుడు, కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు యజమాని షారుఖ్‌ఖాన్‌కు విమానాశ్రయంలో అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో స్టేడియానికి వెళ్లారు. అలాగే ఢిల్లీ క్యాపిటల్స్ యజమాని పార్థ జిందాల్ ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో నగరానికి వచ్చారు. షారుక్ స్టేడియంలో మ్యాచ్ జరుగుతున్నప్పుడు తన జట్టు సభ్యులను ఉత్సాహపరుస్తూ కనిపించారు.

పెన్షన్ల పంపిణీలో జాప్యం

... 5వ పేజీ తరువాయి

ప్రాసెసింగ్, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్, ప్లానింగ్, హెల్త్, ఎనర్జీ సెక్రటరీలు, వారి సహాయకులు మహిళా పోలీసులు ఉన్నారు. వీరంతా ఎన్నికల విధుల్లో ఉన్నారని సమాధానం ఇస్తున్నారు. ఎనర్జీ, ప్లానింగ్, హెల్త్, పోలీస్ సిబ్బందికి ఎటువంటి అదనపు పనులు లేవు. వారికి పింఛన్ల మొత్తం ఇచ్చి, ఇంటింటికీ పంపిణీ చేయించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టి ఉండేది. వలంటీర్లతో ఒకటో తేదీనే 90 శాతం పైగా పింఛన్లు పంపిణీ చేయించేది. అంత మంది సిబ్బందిని పెట్టుకొని రెండు రోజుల్లో పంపిణీ పూర్తి చేయాల్సి ఉండగా నాలుగు రోజుల సమయం తీసుకుంటోంది. మూడో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఇస్తామని ప్రకటించారు. కావాలని ఆలస్యం చేసి, ఆ నింద తెలుగుదేశంపైనే నెట్టడానికే వైసీపీ నాయకులు, ప్రభుత్వ పెద్దలు యత్నిస్తున్నారు.

తొలిరోజు 51.64 శాతం పంపిణీ

విశాఖ జిల్లాలో తొలిరోజు బుధవారం 51.64 శాతం పింఛన్ల మొత్తం పంపిణీ చేసినట్టు అధికారులు తెలియజేశారు. రూ.25.97 కోట్ల మొత్తాన్ని లబ్ధిదారులకు అందించామన్నారు. పెందుర్తి మండలంలో అత్యధికంగా 73.04 శాతం పంపిణీ చేయగా, జోన్-5 కార్యాలయం పరిధిలో అతి తక్కువగా 32.43 శాతం అందించారు.

ఆ బిల్లు కాస్త కట్టేయండి

... 5వ పేజీ తరువాయి

తీసుకుని, ఆ మొత్తాన్ని సర్దుబాటు చేయాలంటూ సీఐకు అప్పగించినట్టు కొద్దిరోజుల కిందట ప్రచారం జరిగింది. జోన్-1 పరిధిలోని ఒక ఏసీపీ అయితే తన నోటి దురుసుతో సీఐలపై విరుచుకుపడడంతోపాటు కించపరిచేలా మాట్లాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సదరు అధికారి తనకు సెల్‌ఫోన్‌లు, ఇంట్లో ఏదైనా సామగ్రి అవసరమైతే వాటిని సమకూర్చే బాధ్యతను సీఐలకే అప్పగిస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు. తాజాగా పోలీస్ కమిషనరేట్‌లోని ఒక కీలకమైన అధికారి తన ఇంట్లోకి ఇటీవల సోఫా కొనుగోలు చేశారని, ఆ బిల్లును పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి చెక్ రూపంలో చెల్లించేసినప్పటికీ, ఆ బిల్లును జోన్-1 పరిధిలోని ఒక సీఐకు ఇచ్చి ఆ మొత్తాన్ని తనకు సర్దుబాటు చేయాలని ఆదేశించినట్టు సమాచారం. ముక్కుసూటి మనిషిగా గుర్తింపు కలిగిన సదరు సీఐ దీనికి ససేమిరా అనడంతో కీలక అధికారి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేయడంతోపాటు వేరే కారణం చూపుతూ మెమో జారీచేసినట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది. ఇలాంటి అధికారులు ఇంకా చాలామంది ఉన్నారని, పోలీస్ ఉన్నతాధికారులకు అలాంటివారిపై పూర్తి సమాచారం ఉన్నప్పటికీ ఎందుకనో అడ్డుకట్ట వేయడం లేదని సీఐలు, కిందిస్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వుడా లేఅవుట్ అన్యాక్రాంతం!

... 5వ పేజీ తరువాయి

నమోదుచేశారు. వారిని పిలిచి హెచ్చరించి పంపించేశారు. తాజాగా కొందరు వ్యక్తులు అదే భూముల వద్దకు తాము క్రికెట్ ఆడుకుంటామని, ఆ భూములను లీజుకు ఇవ్వాలని కోరారు. దానికి ప్లాట్ల యజమానులు నిరాకరించారు. ఇది జరిగిన కొద్దిరోజులకే ఆ వ్యక్తులు మరికొందరితో కలిసి వచ్చి అక్కడి భూములను చదునుచేసే ప్రయత్నం చేశారు. స్థానికులు అడ్డుకోవడంతో వెళ్లిపోయారు. కానీ మళ్లీ అదేరోజు రాత్రి వచ్చి ఆ భూముల్లో బోరు వేశారు. ఈ విషయాన్ని బాధితులు వీఎంఆర్‌డీఏ దృష్టికి తీసుకువెళ్లారు. అయితే అక్కడ స్పందన లేకుండా పోయింది. తాజాగా వారు మరో ప్లాటులో ఇంకో బోరు వేశారు. ఈ విషయం తెలిసి అక్కడ ప్లాట్లు కలిగిన యజమానులు మరోసారి పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వుడా భూ సేకరణ చేసి, లేఅవుట్ వేసిన అమ్మేసిన 13 ఏళ్లకు వచ్చి డీపట్టాలు భూములు కొన్నామంటూ ఎటువంటి హక్కు పత్రాలు లేకుండా దందా చేస్తున్నారని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. అదేవిధంగా వీఎంఆర్‌డీఏ అధికారులకూ ఫిర్యాదు చేశారు. వుడా నుంచి వేలం ద్వారా కొన్న భూములకు కూడా రక్షణ కల్పించకపోతే ఎలాగంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయం కాబట్టే ఇలా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఏయూలోనే ఎందుకిలా...

... 5వ పేజీ తరువాయి

ఉంటుంది. నెలలో ఎన్ని రోజులు ఆలస్యంగా వస్తే అంత మొత్తాన్ని మెస్, ఇతర చార్జీలతోపాటు కలిపి చెల్లించాలి. ఈ అదనపు చార్జీలకు సంబంధించి విద్యార్థులు చెల్లించే మొత్తాలకు రశీదులు మాత్రం ఇవ్వరు. అడిగినా స్పందించరు.

భోజనం నాణ్యత అంతంతే...

ఇక హాస్టళ్లలో పెడుతున్న భోజనం నాణ్యత అంతంత మాత్రంగానే ఉంటోందని విద్యార్థులు చెబుతున్నారు. భోజనంలో పురుగులు ఉంటున్నాయని, అన్నం ఒకరోజు గట్టిగా, మరొకరోజు మెత్తగా ఉంటోందని, తినలేక పోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఈ ఇబ్బందులను అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోందని వాపోతున్నారు. మరుగుదొడ్లు, స్నానాల గదులు సరిగా ఉండడం లేదని, ట్యాప్‌లు పనిచేయడం లేదని చెప్పినా మరమ్మతు చేయించడం లేదని ఇంజనీరింగ్ కళాశాల హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థినులు వాపోతున్నారు.

అదనపు బాదుడు నుంచి ఉపశమనం కలిగించాలి

ఆంధ్ర యూనివర్సిటీలో విద్యార్థుల నుంచి మెస్ చార్జీల పేరుతో అదనంగా వసూలుచేస్తున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదు. అందుకే బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టాం. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన చేస్తాం. విద్యార్థులకు మేలు కలిగించేలా వ్యవహరించాల్సిన అధికారులు...దోపిడీ చేసేలా వ్యవహరించడం దారుణం.

- అఖిల్, ఏబీవీపీ

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా గణేశ్ బాధ్యతలు స్వీకరణ


గణేశ్

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 3: విశాఖ స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా చలువాది శ్రీరామ వెంకట గోపాలకృష్ణ గణేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ప్లాంట్ జీఎం (ఫైనాన్స్, అకౌంటిన్స్)గా విధులు నిర్వహించిన గణేష్ డైరెక్టర్ పోస్టుకు ఎంపికై బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చార్టెడ్ అకౌంటెంట్ అయిన గణేష్ స్టీల్‌ప్లాంట్‌లో 1990లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా సీఎండి అతుల్‌భట్ అభినందనలు తెలిపారు.

'ఉక్కు' కార్మికుల జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం తగదు'



మాట్లాడుతున్న ఇంటక్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 3: ఉక్కు ఉద్యోగులకు జీతాల చెల్లింపులో యాజమాన్యం నిర్లక్ష్యం తగదని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీతాల ఆలస్యంతో ఉద్యోగులు తీ వ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఉద్యోగులు, కార్మికుల ఇబ్బందులను యాజమాన్యం పట్టించుకోలేదని ఆరోపించారు. సంస్థ ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు సరికాదన్నారు. యాజమాన్యం ఆలోచించి కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.వరహాలబాబు, డి.సాహూ, శ్రీనివాసరావు, గంగవరం గోపి, రామ్మోహన్‌రావు, ఓంశాంతి, అప్పారావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెంకటాద్రి హుండీ ఆదాయం రూ. 8 లక్షలు


హుండీ లెక్కింపులో ఆలయ సిబ్బంది

పెందుర్తి, ఏప్రిల్ 3: పెందుర్తి వెంకటాద్రి శిఖరంపై కొలువైయున్న వెంకటాద్రి ఆలయంలో హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో మూడు నెలలకు హుండీ ఆదాయం రూ 8,09,252 లభించినట్లు ఈవో నీలిమ తెలిపారు. ముందుగా వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అగనంపూడి, ఏప్రిల్ 3: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పినమడకలో స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్యసాయి విజన్ క్లినిక్ విజన్ కేర్ సౌజన్యంతో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. 85 మంది రోగులు సేవలు పొందారు. వైద్యుడు శివకుమార్ రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈకార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, కడిమి హనుమంతురావు, రామారావు, కేజే. నాయుడు, మంగరాజు, నూకరాజు, అట్టా అప్పారావు, గోవిందరావు, కాళిదాసు, రామకృష్ణ, సుధామణి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఓం భీం బుష్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, శారద, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **భీమా :** రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **లైన్ మ్యాన్ :** లీలామహల్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక)
- **యమధీర :** మౌర్య (గోపాలపట్నం)
- **గామి :** జగదాంబ, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా20, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 20, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజ్ 22, క్యారెట్ 26, దొండకాయలు 20, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 24, అల్లం (పాతది) 155, బరబాటి 22, ముల్లంగి 16, నిమ్మకా యలు (కిలో) 95, గోరుచిక్కుడు 28, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 165, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 54, ఆగాకర 52, పొటల్స్ 46, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడి కాయ30, కర్రపెండలం 24, మామిడిఅల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 115
ఫారం ధర	-- 135
విత్ స్కిన్	-- 240
స్కిన్‌లెస్	-- 250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ఆటలకు చోటేది..?

- పెందుర్తిలో కలగానే స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం
- దశాబ్దకాలంగా అమలుకాని పాలకుల హామీ

పెందుర్తి, ఏప్రిల్ 3: యువతకు క్రీడలు ఎంతో అవసరం. అయితే, పెందుర్తి ప్రాంతంలో ఆటలాడుకునేందుకు కనీసం స్థలమే కరువయ్యింది. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి 15 ఏళ్ల కిందట చేసిన ప్రతిపాదనపై ఇప్పటికీ కదలిక లేదు. గ్రామీణ,పట్టణ ప్రాంతాలు మిళితమైన ఈప్రాంతంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి పదేళ్ల క్రితం ప్రతిపాదనలు రూపొందించారు. చినముషిడివాడ సమీపాన వుడాకాలనీ వద్ద ఆరెకరాల స్థలం అనువైనదిగా గుర్తించారు. అప్పటి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దీనిని నిర్మాణంపై హామీ ఇచ్చారు. అధికారులు స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ. 3 కోట్లు నిధులు మంజూరుకు వుడా ముందుకువచ్చింది. తర్వాత దీనిపై ప్రణాళిక బద్ధంగా కృషి చేయకపోవడంతో ఈ ప్రతిపాదన కాస్త మూలకుచేరింది. అనంతరం ఎన్నికైన అప్పటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఇదే ప్రాంతంలో ఇండోర్ స్టేడియం నిర్మిస్తామని ప్రకటించినా అదీ కార్యరూపందాల్చలేదు. నియోజవర్గం ప్రధానకేంద్రమైన పెందుర్తిలో కాకుండా మాజీ ఎమ్మెల్యే బండారు సొంత మండలం పరవాడలో ఇండోర్‌స్టేడియం నిర్మాణం జరిపించారు. ఇప్పటి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పలు సందర్భాల్లో పెందుర్తిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీ కూడా ఇప్పటికీ ఇది కలగానే మిగిలిపోతోంది.


పెందుర్తి ఉన్నత పాఠశాలలో వాకింగ్ ట్రాక్


మట్టి, గోతులతో నిండిన దృశ్యం

వాకింగ్ ట్రాక్ ఒక్కటే ..

స్థానిక ఉన్నత పాఠశాలలో అప్పటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి చొరవతో ఏర్పాటుచేసిన వాకింగ్ ట్రాక్ ఒక్కటే యువతకు క్రీడాస్థలంగా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో పలువురు ఇక్కడ వాకింగ్ చేస్తున్నారు. 225 మీటర్లు గల ఈ ట్రాక్ నిర్వహణ లేక అధ్వాన స్థితిలో ఉంది. ట్రాక్‌పై మట్టి పేరుకుని పగుళ్లు ఏర్పడాయి. ఎగుడు, దిగుడుతో ట్రాక్ అస్తవ్యస్తంగా ఉంది. వాకింగ్ సమయంలో మట్టి పైకెగసి ధూళి లేచిపోతోందని యువత ఆ వేదన వ్యక్తంచేస్తోంది. ఎగుడుదిగుడుతో ఉన్న ట్రాక్‌పై నడకతో వెన్నునొప్పి సమస్యలు తలెత్తే ప్ర మాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇక, వర్షం వస్తే ట్రాక్‌లో జలమయమవుతోంది. మండలంలో 15 పంచాయతీలు.. 8 వార్డులు 2,5 లక్షల జనాభా గల నియోజవర్గ ప్రధాన కేంద్రంలో క్రీడలకు ప్రాధాన్యం కల్పించకపోవడం శోచనీయమని పలువురు అభి ప్రాయం వ్యక్తంచేస్తున్నారు.


ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న ఆదారి ఆనంద్ కుమార్


జనాలతో మాట్లాడుతున్న పిల్లా రమాకుమారి

సంక్షేమ పథకాల కొనసాగింపునకు వైసీపీని గెలిపించాలి

- వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం, ఏప్రిల్ 3:ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. నగర పరిధి 89వ వార్డు సంతోష్‌నగర్, డీఏఆర్ న గర్ కాలనీలో ఆనంద్ కుమార్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. గడిచిన ఏడాది కాలంలో ప్రతి సచివాలయం పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపి, పీఏసీఎస్ ఛైర్మన్ అళ్ల పైడిరాజు, స్థానిక నేతలు దొడ్డి కిరణ్, అయితంశెట్టి కోటేశ్వరరావు వార్డు వైసీపీ నేతలు, కార్యకర్తలుపాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తా...

మల్కాపురం: ప్రజా సంక్షేమ కార్యక్రమాలతోపాటు క్రీడలకు ప్రాధాన్యం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ముందుందని పశ్చిమ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనం ద్‌కుమార్ అన్నారు. స్థానిక కొత్తనక్కావానిపాలెంలోని ఏడు వార్డుల వైసీపీ కార్యాలయంలో రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులతో బుధవారం సమావేశం జరిగింది. ఈసందర్భగా ఆయన హాజరై మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే పారిశ్రామిక ప్రాంతంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవిరాజు మాట్లాడుతూ రాష్ట్రానికి తిరిగి జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే ఈ రాష్ట్రంలో క్రీడారంగం మరింతఅభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పరిశీలకులు డాక్టర్ ఎస్‌కే రెహ్మాన్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, బాక్సింగ్ అ సోసియేషన్ సభ్యులు, బాక్సింగ్ కోచ్‌లు, క్రీడాకారుల పాల్గొన్నారు.

61వ వార్డులో ఎన్నికల ప్రచారం ..

మల్కాపురం: గ్రేటర్ 61వ వార్డులో పశ్చిమ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ సోదరి ఎలమంచిలి మున్సిపల్ ఛైర్మన్ పిల్లా రమాకుమారి బుధవారం ఉదయం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె ఓటర్లను కలిసి ఆనంద్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైసీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భ ద్రత ఉంటోందన్నారు. ఈ కార్యక్రమం లో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, వార్డు వైసీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు (వాసు)తో పాట వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు రోజులు దగ్గరపడ్డాయి

- గాజువాక కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు


టౌన్‌షిప్‌లో ఎన్నికల ప్రచారంలో పల్లా శ్రీనివాసరావు, కోన తాతారావు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 3: వైసీపీ దుర్మార్గ పాలనకు రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో రాష్ట్ర టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు, అడుసుమల్లి దీప్తి నేతృత్వంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులు పెట్టిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనని అని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో ఐదేళ్లపాటు రాష్ట్ర వైసీపీ ప్రభుత్వం కార్మికులకు నమ్మక ద్రోహం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జీ కోన తాతారావు, నాయకులు విల్లా రామ్మోహన్‌కుమార్, నమ్మి సింహాద్రి, చీపురుపల్లి శ్రీనివాస్, సోమన్న పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ఆధునికీకరణ పనులు ప్రారంభం


వికాస్‌నగర్‌లో స్టేడియం నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

పెదగంట్యాడ, ఏప్రిల్ 3 : జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాస్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం ఆధునికీకరణ పనులు ప్రారంభమయ్యాయి. సుమారు రెండు కోట్ల రూపాయల వ్యయంలో ఈ పనులు పూర్తిచేపట్టేందుకు జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. ఇండోర్ స్టేడియం భవనానికి సంబంధించిన ముందు భాగం పాడవ్వడంతో దాన్ని అందం తీర్చిదిద్దేందుకు పనులు ప్రారంభించారు. పాడైన భాగాలను తొలగిస్తున్నారు. అలాగే స్టేడియం లోపల ఫ్లోరింగ్ చాలా భాగం పాడయ్యింది. ఫ్లోరింగ్‌కు వినియోగించిన వుడెన్ ప్లాటుఫారం కూడా దెబ్బతినడంతో దాన్ని తొలగిస్తున్నారు. రూఫ్‌నకు సంబంధించిన పాడైన భాగాలను తొలగిస్తున్నారు. స్టేడియం చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్, వాలీబాల్ కోర్టు, టెన్నిస్ కోర్టు, మరుగుదొడ్ల సముదాయం, ఆధునీకరించేందుకు సన్నాహక చర్యలు చేపట్టారు. ఇప్పటికే స్టేడియం చుట్టూ పేరుకుపోయిన పిచ్చి మొక్కలను, ముళ్ళపొదలను తొలగించారు. నెలరోజుల్లో ఆధునీకరణ పనులు పూర్తి చేసేందుకు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

పింఛన్ల కోసం పడిగాపులు


87వ వార్డు సచివాలయం ఎదుట నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

ఎన్.ఎ.డి. జంక్షన్ ఏప్రిల్ 3: సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ ఆలస్యంపై సమాచారం లేకపోవటం అనేక మంది పింఛనదార్లు ఇబ్బంది ఎదుర్కొన్నారు. నగదును బ్యాంకులు నుంచి విత్‌డ్రా చేయటం కోసం అధికారులు బ్యాంకులు వెళ్లారు. ఇది తెలియని అనేకమంది ఫించనుదార్లు ఉదయం వచ్చి వెనుదిరిగారు. మధ్యాహ్నం 2.30 గంటల తరువాత పింఛన్లు పంపిణీ ప్రారంభించారు. సచివాలయాలకు సంబంధించిన పూర్తిస్థాయిలో నగదు విత్‌డ్రా కాకపోవటంతో ఫించన్లు పంపిణీ పూర్తిగా ప్రారంభం కాలేదు. దీంతో గురువారం నుంచి ఇచ్చేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

సచివాలయాల వద్ద వైసీపీ నాయకులు ప్రచారం

బాజీ జంక్షన్ సుసర్లకాలనీ వద్ద ఉన్న 470, 471 సచివాలయాల వద్ద మధ్యాహ్నాం 2.30 గంటల సమయం నుంచి పంపిణీ ప్రారంభం అయ్యింది. కొందరు వైసీపీ నాయకులు ఫించన్‌దారుల ఎదుట వద్ద ప్లకార్డులు పట్టుకొని జగన్‌కు అనుకూలంగా, చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైసీపీ సానుభూతిపరులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

పెందుర్తి: నగదు కోసం బ్యాంకుకు వెళ్లిన సచివాలయ సిబ్బంది తిరిగి చేరుకోవడం జాప్యంకావడంతో లబ్ధిదారులకు అవస్థలు తప్పలేదు. పెందుర్తిలో గల 511 సచివాలయంలో మధ్యాహ్నం నగదు రావటంతో లబ్ధిదారులు నుంచి అసహనం వ్యక్తంచేశారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని అన్ని సచివాలయాల్లో శానిటేషన్ సెక్రటరీ, వెల్ఫేర్ సెక్రటరీ, మహిళా సంరక్షణ కార్యదర్శి, డేటా ప్రాసెస్ ఉద్యోగి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. యాతపాలెం సచివాలయంలో బుధవారం సాయంత్రం విధులు ముగిసే సమయానికి 80శాతం పింఛన్లు పంపిణీ అయినట్టు సిబ్బంది తెలిపారు. సచివాలయానికి రాలేని వికలాంగులు, రోగులకు గురువారం వారి ఇళ్లవద్దనే పింఛన్లు ఇస్తామనితెలిపారు.

కూర్మన్నపాలెం: బ్యాంకుల నుంచి డబ్బులు తేవడంలో ఆలస్యమైంది. దీంతో సాయంత్రం 4 గంటలకు వడ్లపూడి సచివాలయాలు 2,4 పింఛన్ పంపిణీ ప్రారంభించారు.మిగి లిన సచివాలయాలు వేల్ఫేర్ కార్యదర్శులు బ్యాంకులకు వెళ్లి 5 గంటలు దాటినా రాకపోవటంతో వృద్ధులు ఉసూరుమంటూ వెనుతిరిగారు.

మల్కాపురం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల వృద్ధులు, వింతులు, వికలాంగులకు పెన్షన్లను బుధవారం సాయంత్రం సచివాలయాలలో అందజేశారు. సచివాలయ కార్యదర్శులు మధ్యాహ్నం బ్యాంక్‌లకు వెళ్లి డబ్బులను తీసుకువచ్చి పింఛన్లు పంపిణీ చేశారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

పెదగంట్యాడ, ఏప్రిల్ 3: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబేకాలనీ వెంకటాద్రి కొండపై నిర్మించిన ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠా ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యజ్ఞం చేశారు. ఉత్తరాంధ్ర సాధుపరిషత్తు అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామి, వేద పండితులు కొండూరి వెంకటరమణా చార్యులు, మరో 17 మంది వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా పూజలు చేసి విగ్రహప్రతిష్ఠ చేశారు. గాజువాక నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని యాగ శాలలో మహాహోమం చేశారు. ఆలయకమిటీ ఛైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, రాజాన రామారావు, మహ్మద్ ఇమ్రాన్, మంత్రి రాజశేఖర్, విగ్రహదాతలు పెంటకోట నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు.


రాజులపాలెంలో శ్రీవారి ఆలయ ప్రాంగణంలో భక్తులు

అగనంపూడి, ఏప్రిల్ 3: జీవీఎంసీ 85వ వార్డు పరిధి వినాయక నగర్‌లోని శ్రీవినాయక ఆల యంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠామహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులతో ఆలయం ముందు ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో లలితా సహస్ర నామ విష్ణు పారాయణం జరిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రౌతు రామచంద్రరావు, దాముర్తేతి అర్జున్, శ్రీనివాసరావు, కామునాయుడు, గుర్రం అప్పారావు, సత్యం, రవి, ప్రసిద్, తదితరులు పాల్గొన్నారు.


65వ వార్డు వాంబేకాలనీలో వెంకన్న విగ్రహాలకు పూజలు

నేడు రామానుజుల విగ్రహాలు ఆవిష్కరణ

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 3: జీవీఎంసీ 87వ వార్డు రాజులపాలెం శ్రీవారి ఆలయ ప్రాంగణంలో గురువారం శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా ఆళ్వారుల విగ్రహములు, శ్రీ రామానుజ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సుప్రభాతం, ద్వారతోరణ పూజ, కలశాధిర విశేష పూజ, నిత్యహోమాలు తదితర పూజలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి మేలు

- పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు


59వ వార్డులో ప్రచారం చేస్తున్న గణబాబు

మల్కాపురం, ఏప్రిల్ 3 : తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి అధికారంలోకి అధికారంలోకి వస్తే రా ష్ట్రానికి అన్ని విధాల మేలు చేకూరుతుందని పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్య ర్థి పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పేర్కొన్నారు. గ్రేటర్ 59వ వార్డులో బుధవారం గణబాబు ఎన్నికల ప్రచా రం నిర్వహించారు. ఈసందర్భంగా ఆ యన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. అలాగే బీసీలకు న్యాయం జరుగుందన్నారు. వైసీపీ పాలనంతా మోసమేనని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీఎన్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి మితిరెడ్డి శంకర్, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు రామోహ్మన్‌నాయుడుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎండలో రేషన్ సరకుల కోసం నిరీక్షణ


86వ వార్డు శాతవాహన నగర్ రోడ్డు పై మండుటెండలో లబ్ధిదారులు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 3: ఇంటి ముంగిటికే రేషన్ పంపిణీ చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఇంటివద్దకు రేషన్ పంపిణీ జరగక పోగా, ఎక్కడపడితే రేషన్ పంపిణీ చేస్తూ ఎండలో నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంటోందని వినియోగదారులు వాపోతున్నారు. బుధవారం కూర్మన్నపాలెం దరి శాతవాహన నగర్‌లో రోడ్డు పైనే ఇలా మండుటెండలో సరుకులు కోసం వినియోగదారులు పడిగాపులు పడ్డారు.

గిరిజన సంస్కృతిని పరిరక్షించాలి

- విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర


అనంతగిరి సమీపంలో మూలవిరాట్ ప్రతిష్ఠలో పాల్గొన్న పీఠాధిపతులు

పెందుర్తి, ఏప్రిల్ 3: గిరిజన సంస్కృతిని పరిరక్షించడంతోపాటు మన్యంలో అన్యమత ప్రచారాన్ని నియంత్రించాలని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర అన్నారు. అరకు జిల్లాలోని అనంతగిరి మండలంలోని వైకుంఠగిరిపై నూతనంగా నిర్మించిన అనంత వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. విశిష్ట అతిథిగా హాజరైన పీఠాధిపతి స్వరూపానందేంద్ర ప్రారంభించారు. తొమ్మిదిన్నర అడుగుల వేంకటేశ్వర స్వామి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారు.ఈసందర్భంగా భక్తులనుద్దేశించి స్వామీజీ అనుగ్రహభాషణ చేస్తూ పర్వత శిఖరాల్లో నిర్మించిన ఈ దేవాలయం హైందవ ధర్మ విశిష్టతకు దిక్సూచీగా ఉందన్నారు. గిరిజనులకు పీఠం అందిస్తున్న సేవా కార్యక్రమాలు వివరించారు. అంతకుముం దు ఆలయంలో పలు విగ్రహాలకు పీఠాధిపతితో ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్రలు ప్రాణప్రతిష్ఠ చేశారు. గిరిజన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు


పెందుర్తిలో సీసీ కెమెరాల ఏర్పాటును పర్యవేక్షిస్తున్న సీఐ రామకృష్ణ

పెందుర్తి, ఏప్రిల్ 3: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెందుర్తిలో సమస్యాత్మక ప్రాంతాల్లో గుర్తించిన పోలింగ్‌కేంద్రాలు వద్ద పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో బుధవారం సీఐ ఎల్. రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఈపీఎస్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. పోలింగ్ సమయంలో శాంతి, భద్రతలకు విఘాతం కలగకుండా ఈ సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామని సీఐ రామకృష్ణ వివరించారు,

ఇళ్ల వద్ద పింఛన్లు ఇవ్వాలని వినతి

గాజువాక, ఏప్రిల్ 3: సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పంపిణీ చేయాలని గాజువాక తహసీల్దార్ శ్రీవల్లికి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు బుధవారం వినతి పత్రం అందజేశారు. పింఛన్లు ఇళ్ల ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం వేధించడం భావ్యం కాదన్నారు. ఈ నగదును తన అనుచరుల ద్వారా అందించాలని వైసీపీ ప్రభుత్వం డ్రామాలాడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు, సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ గంధం శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

8న నూకాంబిక ఆలయ వార్షికోత్సవం

ఆటోనగర్, ఏప్రిల్ 3: జీవీఎంసీ 70వ వార్డు ఎల్‌వీ నగర్ శ్రీ నూకాంబికా అమ్మవారి తృతీయ వార్షిక ఉత్సవాలు ఈనెల 8వతేదీన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా సభ్యులు వి.రాజారావు మాట్లాడుతూ ఏప్రిల్ 8న ప్రత్యేక పూజలు, హోమాలు,పరస మహోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు లంకల మురళీ దేవి, సూరిబాబు, తుంపాల చిరంజీవి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు

'ఉక్కును పరిరక్షించుకుందాం'

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 3: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, దాన్ని పరిరక్షించటం కోసం అన్ని రాజకీయ పార్టీలు ఒకే తాటిపైకి రావాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి ఆదినారాయణ అన్నారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 1147 రోజుల రిలే నిరాహార దీక్షల శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐక్య పోరాటాలతో ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకుంటామన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న ఉక్కు కర్మాగారాన్ని విక్రయించడానికి ఎవరితరం కాదన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎస్.రామారావు మాట్లాడుతూ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలన్నారు. సెయిల్, ఎన్ఎండీసీతో విశాఖ స్టీలుప్లాంట్‌ను విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి కార్మికులకు ఆమోదయోగ్యంగా స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో నడపాలన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వేపగుంట ఏప్రిల్ 3: పురుషోత్తపురం 11 కె.వి.ఫీడర్‌లో మెంటైనెన్స్ చెట్లు కొమ్మలు తొలగింపు చేపట్టనున్నందున గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేయనున్నట్లు వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పనులు కారణంగా చిమలాపల్లి, వరలక్ష్మీనగర్, సంతోష్‌నగర్, బ్రహ్మంగారి మఠం తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపేస్తామన్నారు. ఆయా ప్రాంతప్రజలు గమనించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సాయి ధ్యానమందిరంలో 9న ఉగాది ఉత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 3 : గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో ఈ నెల 9వ తేదీన ఉగాది, 17వ తేదీన శ్రీరామ నవమి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరి రావు తెలిపారు. ఈమేరకు బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు.

టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిల కో ఆర్డినేటర్‌గా పరదేశీయాదవ్



పరదేశీయాదవ్

మహారాణిపేట, ఏప్రిల్ 3: విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిల కో ఆర్డినేటర్‌గా బొట్టా పరదేశీ యాదవ్ నియమితులయ్యారు. పార్టీ సెంట్రల్ బీసీ కమిటీ అధి కారికంగా విశాఖలో నియోజక వర్గాల క్లస్టర్ ఇన్‌చార్జిలు, కో ఆర్డినే టర్లను ప్రకటించింది. దక్షిణం కో ఆర్డినేటర్‌గా టీడీపీ బీసీ కమిటీ కార్యదర్శి బొట్టా పరదేశీ యాదవ్ అధిష్ఠానం ప్రకటించింది. ఈ సంద ర్భంగా పరదేశీ మాట్లాడుతూ క్లస్టర్ ఇన్‌చార్జిలు బూత్ ఇన్‌చార్జిలతో కలసి వంశీ కృష్ణ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు.

స్వర్ణకారులకు రుణాలు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 3: స్వర్ణకారులకు రుణాలు మంజూరు చేసి బ్యాంకు ఆఫ్ ఇండియా విశాఖ జోనల్ ఆదుకోవడం అభినందనీయమని రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ అన్నారు. ముద్ర రుణాల ద్వారా స్వర్ణకారులకు ముడి బంగారం వస్తువులు తయారీకి రుణాలను మంజూరు చేసి వారి కుటుంబ పోషణకు బ్యాంకు దోహదపడుతుందన్నారు. నగర అధ్యక్షుడు ముదపాక రవి, ప్రధాన కార్యదర్శి పెదపూడి బ్రహ్మం, బ్యాంకు మేనేజర్ బెవరా రామ్మోహన్ పాల్గొన్నారు.



రైల్వేన్యూకాలనీలో పెన్షన్ కోసం వేచి ఉన్న వృద్ధులు



42వ వార్డులోని సచివాలయం తెరవక బయటే ఉన్న పింఛన్‌దారులు

పింఛన్‌దారుల పాట్లు వర్ణనాతీతం

- ఉదయం నుంచి ఎండలో నిరీక్షణ
- మధ్యాహ్నం నగదు రాక.. తర్వాత పంపిణీ

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 3 : గ్రేటర్ 26, 27, 42, 43, 44, 45, 46 వార్డుల పరిధిలోని సచివాలయాల్లో పింఛన్ల కోసం సామాజిక పెన్షన్‌కోసం పింఛన్‌దారులు పడిగాపులు కాశారు. ఆయా ప్రాంతాల్లోని సచివాలయాలకు ఉదయం 9 గంటలకే చేరుకున్నా, కొన్నిచోట్ల తలుపులు పది గంటలైనా తెరుచుకోకపోవడంతో నిరీక్షించాల్సి వచ్చింది. గోడలపైనున్న కార్యదర్శులనెంబర్లకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. కొంతమంది లిఫ్ట్ చేసి సాయంత్రం నాలుగు గంటలకు క్యాష్ వస్తుందని, అప్పటి వరకూ పెన్షన్ పంపిణీ జరగదని సమాధానమిచ్చారు. ఉదయం 11 వరకు క్యాష్ రాకపోవడంతో కొంతమంది పెన్షన్ దారులు నిరాశతో ఇంటి ముఖం పట్టారు. మరి కొంతమంది సచివాలయాల వద్దే నిరీక్షించారు. అక్కయ్యపాలెం, శ్రీనివాసనగర్‌లోని సచివాలయాల్లో మధ్యాహ్నం 2 గంటలకు క్యాష్ రావడంతో సెక్రటరీలు పెన్షన్లు పంపిణీ చేశారు. చిన్నూరు, రైల్వేన్యూకాలనీ తదితర ప్రాంతాల్లోని సచివాలయాల్లో క్యాష్ ఆలస్యంగా రావడంతో పెన్షన్ల పంపిణీ ఆలస్యమైంది. దీంతో పెన్షన్ దారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కూటమి విజయంతోనే అభివృద్ధి : విష్ణుకుమార్‌రాజు



మాట్లాడుతున్న దక్షిణ కూటమి అభ్యర్థి విష్ణుకుమార్ రాజు

మాధవధార, మార్చి 3 ; విశాఖ ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు బుధవారం మురళీనగర్ వాకర్స్ క్లబ్ సీనియరు మెంబర్లను కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నుంచి ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను గెలిపించేలా ఆశీర్వదించాలని మురళీనగర్ సీనియరు సిటిజన్లను అభ్యర్థించారు. రిటైర్డు ఉద్యోగి, వాకర్స్‌క్లబ్ వ్యవస్థాపక సభ్యులు బుచ్చయ్య చౌదరిని కలసి మద్దతు కోరారు. 90ఏళ్లు నిండిన బుచ్చయ్య చౌదరిని ముందుగా సన్మానించిన విష్ణుకుమార్ రాజు ఈ ప్రాంత అభివృద్ధి పాటు రాష్ట్రం సమగ్ర ప్రగతి ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయంతోసాధ్యమవుతుందని అన్నారు. ప్రచారంలో టీడీపీ 50వవార్డు అధ్యక్షులు సనపల.వరప్రసాద్, జనసేన పార్టీ నాయకులు బి.రఘు, బీజేపీ నాయకులు ఉన్నారు.

బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి కృషి

- 'దక్షిణం' కూటమి అభ్యర్థి వంశీ కృష్ణ



ప్రచారంలో వంశీ కృష్ణ

జగదాంబ కూడలి, ఏప్రిల్ 3: దక్షిణ నియోజవర్గంలో బీసీ, ఎస్సీ, మైనారిటీ సామాజికవర్గాల అభ్యున్నతికి పాటుపడతానని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వంశీ కృష్ణ హామీ ఇచ్చారు. గ్రేటర్ 30వ వార్డులో కుమ్మర వీధి పోల మాంబ గుడి వద్ద బుధవారం అమ్మవారికి పూజలు నిర్వహించి పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కుమ్మరవీధి పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, మహిళలు వంశీకి స్వాగతం పలికారు. జెండా చెట్టు, తాడివీధి, సాలిపేట ప్రాంతాల్లో ప్రచారం చేశారు. దక్షిణంలోని సీనియర్ నాయకుడు సీతంరాజు సుధాకర్‌తోపాటు ఆయన వెంట ఉన్న వైసీపీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్ తదితరులు పాల్గొన్నారు. నాంగవంశ సంక్షేమ సంఘం పెద్దలను వార్డు అధ్యక్షుడు దొకర రమణ సమక్షంలో వంశీ కృష్ణ కలిసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు బొచ్చారాము, కొల్లి రమేష్, విల్లూరి చక్రవర్తి, తెలుగు మహిళలు కేదారి లక్ష్మి, మాజీ కార్పొరేటర్ పోలిపిల్లి జ్యోతి, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, ఉరుకూటి నారాయణరావు, జనసేనకు చెందిన వీరమహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'బీజేపీకి మళ్లీ అధికారమిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారు'

సీతమ్మధార, ఏప్రిల్ 3: కేం ద్రంలో మళ్లీ అధికారం ఇస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని బహిరంగ ప్రకటన చేసిన బీజేపీని, రాష్ట్రంలో ఆ పార్టీకి మద్దతు ఇస్తున్న టీడీపీ, జనసేన పార్టీలకు దళితుల మద్దతురానున్న ఎన్నికల్లో ఉండదని విదసం ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు తెలిపారు. రామాటాకీస్ రోడ్డు లో అంబేడ్కర్ భవన్‌లో విదసం రాష్ట్ర సమితి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ళుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ భారత రాజ్యాంగానికి అడుడగునా తూట్లు పొడిచిందన్నారు. ఇప్పుడు 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్నే మార్చేస్తామని ప్రకటించిందని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో ఆదివాసీలపై మత విద్వేషంతో మారణ హోమం సృష్టించి వందల మది మానప్రాణాలను బలి తీసుకవడంతోపాటు దేశంలో ఆదివాసీలు, దళితులు, క్రైస్తవ ముస్లిం మైనారిటీలకు రక్షణ లేదన్నారు. రాజ్యాంగ పీఠికలో లౌకికవాదం అనే పదాన్ని తొలగించి మనువాద దృక్పథంతో దేశాన్ని మతపరమైన రాజ్యంగా మార్చే కుట్ర జరుగుతోందన్నారు. ఈస్థితిలో కాంగ్రెస్ నేతృత్వంలో ఉన్న అతిపెద్ద రాజకీయ లౌకిక కూటమి ఇండియా కూటమిని గెలిపించడం తక్షణ అవసరమని ఉద్ఘాటించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించి 20కి పైగా సంక్షేమ పథకాలకుకోతవేసిందన్నారు. కోడి కత్తి శ్రీను బెయిల్ రద్దు, పథకాల సాధన కోసం విదసం సమరశీల పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. సహాయ కన్వీనర్ సోడదాసి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బల్ల కూమార్, జాజి ఓంకార్, బోడపాటి శామ్యూల్ కుమార్, బూల భాస్కరరావు, గుడాల ఈశ్వర రావు, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు అప్రజాస్వామికం

- ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శీర రమేష్‌కుమార్



నిరసన ర్యాలీగా వెళుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 3: ప్రతిపక్ష పార్టీలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవరిస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శీర రమేష్‌కుమార్ అన్నారు. డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఇండియా కూటమి, భారత్ బచావో, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు క్రేజీవాల్ అరెస్టును నిరసనగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులందరినీ తక్షణమే విడుదల చేసి అసలు నేరస్తులను అరెస్టు చేయాలన్నారు. బీజేపీ కుట్రపూరిత హిందూ ఇజాన్ని చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని మోదీ అసలు రంగు బయటపెట్టాలని విమర్శించారు. కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌ల అరెస్టులకు నిరసనగా ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు డా.సీతల్‌మదాన్, కాంగ్రెస్ నేత ప్రియాంకదండి, సీపీఐ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

పాడేరు ఘాట్‌లో ఘోరం

- అదుపుతప్పి లోయలోకి బోల్తాపడిన బొలేరో
- ఇద్దరు మృతి, 30 మందికి గాయాలు



క్షతగాత్రులను అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

పాడేరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఘాట్‌రోడ్డులో బుధవారం రాత్రి ఘోర ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో కిక్కిరిసిన బొలేరో అదుపుతప్పి లోయలోకి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒక మహిళ (35), పురుషుడు (40) మృతిచెందగా, మరో 30 మంది గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం నుంచి కూలి పనుల కోసం 32 మంది బొలేరో వాహనంలో బుధవారం విజయవాడ బయలుదేరారు. పాడేరు మీదుగా మైదాన ప్రాంతానికి చేరే క్రమంలో రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో స్థానిక ఏసు బొమ్మ మలుపునకు ముందున్న మలుపు వద్ద వాహనం అదుపుతప్పి లోయలోకి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న ఒక మహిళ, మరో పురుషుడు అక్కడికక్కడే మృతిచెందగా, డ్రైవర్‌తో సహా మరో 30 మందికి గాయాలయ్యాయి. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వారు గమనించి బొలేరోలో చిక్కుకున్న వారికి లోయలో నుంచి బయటకు తీశారు. అంబులెన్సులకు సమాచారం ఇచ్చి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. రాత్రి సమయంలో సంఘటన జరగడంతో మృతులు, క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు.

మరో నలుగురు వలంటీర్ల రాజీనామా

పెందుర్తి, ఏప్రిల్ 3: మండలంలో వాలంటీర్ల రాజీనామా పరంపర కొనసాగుతోంది. బుధవారం రాంపురానికి చెందిన నలుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసేందుకువలంటీర్లు రాజీనామాలు చేస్తున్నారని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో వలంటీర్లు రాజీనామాలు చేసిన వారి సంఖ్య 34 మంది చేరినట్లు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు.

బృందవన పార్కులో పారిశుధ్య పనులు



పార్కులో శుభ్రపరుస్తున్న కార్మికులు

సీతమ్మధార, ఏప్రిల్ 3: జీవీఎంసీ 24వ వార్డు శానిటరీ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది సీతమ్మధార టీపీటీ కాలనీలోని బృంద వనపార్కు పారిశుధ్య కార్య క్రమం చేపట్టారు.అధిక సంఖ్యలో పారిశుధ్య సిబ్బందిపాల్గొని పార్కులోచెత్తచెదారంలేకుండా తొల గించారు. పార్కులో వాకర్స్‌హర్షం వ్యక్తం చేశారు.

మాధవధారలో కరెంటు కష్టాలు



సాయంత్రం చీకటిగా మారిన వీధులు

మురళీనగర్, ఏప్రిల్ 3; ఈపీడీసీఎల్ మాధవధార ఎస్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం కరెంటు కష్టాలు ఎదురయ్యాయి. ఇన్ కమింగ్ లేక సబ్‌స్టేషన్‌కే పవర్ కొరత నెలకొంది. సబ్‌స్టేషన్ పరిధి ప్రాంతాలకు దాదాపు 6 గంటల పాటు విద్యుత్ సరఫరా ఆపేశారు. ఎండల కాలంలో మిట్ట మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6.30 నిమిషాల వరకు సరఫరా లేక నివాసితులు అల్లాడిపోయారు. కనీసం ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా కరెంటు సరఫరా నిలిపేయడంతో అటు వ్యాపారాలు దెబ్బతిన్నాయి. ఎండాకాలంలో జోరుగా వ్యాపారాలు చేసే జ్యూస్ సెంటర్లు , సాధారణ వెల్డింగ్ దుకాణాలు, కార్పెంటర్ షాపులు, హోటళ్ల నిర్వాహకులు లబోదిబోమంటున్నారు. ఇళ్లల్లో జనం ఉక్కపోత జనాలు ఇక్కట్లు చవిచూశారు.

చురుగ్గా పోలీసుస్టేషన్ ప్రహరీ నిర్మాణ పనులు



ప్రహరీ నిర్మాణానికి పునాదులు తీసిన దృశ్యం

మురళీనగర్, ఏప్రిల్ 3; గ్రేటర్ 51వవార్డులో ఉన్న ఎయిర్‌పోర్టు జోన్ పోలీసు స్టేషను వద్ద ప్రహరీ, గెడ్డ నీటి ప్రవాహానికి డెక్టు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఎలక్షన్ కోడ్‌కి ముందు రోజే ఇక్కడ పనులను ఆరంభించారు. రూ.39 లక్షల జీవీఎంసీ నిధులు కేటాయించారు. ఎగువ కొండ ప్రాంతంలోని మాధవధార ఉడాకాలనీ, ఎస్.ఆర్.నగర్ ప్రాంతాలు సహా ఆర్టీఏ కార్యాలయం ఎగువ నుంచి చేరుతున్న వర్షం నీరు, కాలువ ప్రవాహాల ముంపు నుంచి రక్షణగా చేపడుతున్న ఈ పనులు మంజూరైనట్టు కార్పొరేటరు రెయ్యివెంకటరమణ తెలిపారు. పోలీసు స్టేషను ఆవరణ నుంచి, ఏసీపీ ఆఫీసు ప్రాంతం దిగువన ఉన్న హైవే రోడ్డు గెడ్డకు పనులను కలుపుతూ నిర్మాణాలు చేపడుతున్నారు. రానున్న వర్షకాలంలోగా పనులు పూర్తిచేస్తామని ఇంజనీరింగ్ విభాగం అధికారులు తెలిపారు.

మత్స్యకారులకు శ్రీభరత్ పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

మహారాణిపేట, ఏప్రిల్ 3: విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లి గల్లంతైన బాధిత మత్స్యకారులను విశాఖ పార్లమెంట్ అభ్యర్థి ఎం శ్రీ భరత్, దక్షిణ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు. ఈ నెల 1వ తేదీన ఫిషింగ్ హార్బర్ జెట్టి నుంచి బోటు మీద చేపల వేటకు వెళ్లిన ఆరుగురు మత్స్యకారులు రెండవ తేదీ నుంచి వారి ఆచూకీ తెలియరాలేదు. దీనితో నేవీ అధికారులు హెలీకాప్టర్లతో గాలింపు చర్యలు చేపట్టగా, మత్స్యకారుల అప్పికొండ ప్రాంతంలో క్షేమంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ వారిని పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారులను ఎమ్మెల్యే వాసుపల్లి గణేషుకుమార్ పరామర్శించారు.

చెలరేగిన కోల్‌కతా నైట్‌రైడర్స్

... 5వ పేజీ తరువాయి

హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. నరేన్‌కు ఫిల్ సాల్ట్ (18) స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన రఘువన్షీ తోడవ్వడంతో స్కోరు బోర్డు మరింత వేగం పుంజుకుంది. అద్భుతమైన షాట్లతో అలరించిన రఘువన్షీ తన ఐపీఎల్ కెరీర్‌లో తొలి అర్ధ సెంచరీ (54; 3 సిక్సర్లు, 5 బౌండరీలు) సాధించాడు. మరోవైపు కేవలం 39 బంతుల్లో ఏడు బౌండరీలు, ఏడు సిక్సర్లతో 85 పరుగులు చేసిన సునీల్ నరైన్ (85) రెండో వికెట్‌గా అవుటయ్యాడు. ఆ తర్వాత స్థానాల్లో దిగిన ఆండ్రూ రస్సెల్ (41), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (18), రింకూ సింగ్ (26) సిక్సర్లు, బౌండరీలతో విరుచుపడడంతో జట్టు స్కోరు 272 పరుగులకు చేరింది. భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 17.2 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రిషబ్ పంత్ (55), స్టబ్స్ (54) అర్ధ సెంచరీలు సాధించగా, మిగిలిన బ్యాట్స్‌మెన్లు ఘోరంగా విఫలమయ్యారు. కేకేఆర్ బౌలర్లలో వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి తలో మూడు వికెట్లు పడగొట్టగా, మిచెల్ స్టార్క్ రెండు వికెట్లు తీశాడు.

షారుఖ్ ఖాన్ సందడి

గోపాలపట్నం (విశాఖపట్నం), ఏప్రిల్ 3: స్థానిక ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బుధవారం కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య జరిగే ఐపీఎల్ మ్యాచ్‌ను తిలకించడానికి ఆయా జట్ల యజమానులు ప్రత్యేక విమానాల్లో నగరానికి చేరుకున్నారు. ముంబై నుంచి ప్రత్యేక విమానంలో బుధవారం సాయంత్రం ఇక్కడకు విచ్చేసిన బాలీవుడ్ నటుడు, కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు యజమాని షారుఖ్‌ఖాన్‌కు విమానాశ్రయంలో అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో స్టేడియానికి వెళ్లారు. అలాగే ఢిల్లీ క్యాపిటల్స్ యజమాని పార్థ జిందాల్ ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో నగరానికి వచ్చారు. షారుక్ స్టేడియంలో మ్యాచ్ జరుగుతున్నప్పుడు తన జట్టు సభ్యులను ఉత్సాహపరుస్తూ కనిపించారు.

పెన్షన్ల పంపిణీలో జాప్యం

... 5వ పేజీ తరువాయి

ప్రాసెసింగ్, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్, ప్లానింగ్, హెల్త్, ఎనర్జీ సెక్రటరీలు, వారి సహాయకులు మహిళా పోలీసులు ఉన్నారు. వీరంతా ఎన్నికల విధుల్లో ఉన్నారని సమాధానం ఇస్తున్నారు. ఎనర్జీ, ప్లానింగ్, హెల్త్, పోలీస్ సిబ్బందికి ఎటువంటి అదనపు పనులు లేవు. వారికి పింఛన్ల మొత్తం ఇచ్చి, ఇంటింటికీ పంపిణీ చేయించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టి ఉండేది. వలంటీర్లతో ఒకటో తేదీనే 90 శాతం పైగా పింఛన్లు పంపిణీ చేయించేది. అంత మంది సిబ్బందిని పెట్టుకొని రెండు రోజుల్లో పంపిణీ పూర్తి చేయాల్సి ఉండగా నాలుగు రోజుల సమయం తీసుకుంటోంది. మూడో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఇస్తామని ప్రకటించారు. కావాలని ఆలస్యం చేసి, ఆ నింద తెలుగుదేశంపైనే నెట్టడానికే వైసీపీ నాయకులు, ప్రభుత్వ పెద్దలు యత్నిస్తున్నారు.

తొలిరోజు 51.64 శాతం పంపిణీ

విశాఖ జిల్లాలో తొలిరోజు బుధవారం 51.64 శాతం పింఛన్ల మొత్తం పంపిణీ చేసినట్టు అధికారులు తెలియజేశారు. రూ25.97 కోట్ల మొత్తాన్ని లబ్ధిదారులకు అందించామన్నారు. పెందుర్తి మండలంలో అత్యధికంగా 73.04 శాతం పంపిణీ చేయగా, జోన్-5 కార్యాలయం పరిధిలో అతి తక్కువగా 32.43 శాతం అందించారు.

ఆ బిల్లు కాస్త కట్టేయండి

... 5వ పేజీ తరువాయి

తీసుకుని, ఆ మొత్తాన్ని సర్దుబాటు చేయాలంటూ సీఐకు అప్పగించినట్టు కొద్దిరోజుల కిందట ప్రచారం జరిగింది. జోన్-1 పరిధిలోని ఒక ఏసీపీ అయితే తన నోటి దురుసుతో సీఐలపై విరుచుకుపడడంతోపాటు కించపరిచేలా మాట్లాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సదరు అధికారి తనకు సెల్‌ఫోన్‌లు, ఇంట్లో ఏదైనా సామగ్రి అవసరమైతే వాటిని సమకూర్చే బాధ్యతను సీఐలకే అప్పగిస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు. తాజాగా పోలీస్ కమిషనరేట్‌లోని ఒక కీలకమైన అధికారి తన ఇంట్లోకి ఇటీవల సోఫా కొనుగోలు చేశారని, ఆ బిల్లును పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి చెక్ రూపంలో చెల్లించేసినప్పటికీ, ఆ బిల్లును జోన్-1 పరిధిలోని ఒక సీఐకు ఇచ్చి ఆ మొత్తాన్ని తనకు సర్దుబాటు చేయాలని ఆదేశించినట్టు సమాచారం. ముక్కుసూటి మనిషిగా గుర్తింపు కలిగిన సదరు సీఐ దీనికి ససేమిరా అనడంతో కీలక అధికారి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేయడంతోపాటు వేరే కారణం చూపుతూ మెమో జారీచేసినట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది. ఇలాంటి అధికారులు ఇంకా చాలామంది ఉన్నారని, పోలీస్ ఉన్నతాధికారులకు అలాంటివారిపై పూర్తి సమాచారం ఉన్నప్పటికీ ఎందుకనో అడ్డుకట్ట వేయడం లేదని సీఐలు, కిందిస్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వుడా లేఅవుట్ అన్యాక్రాంతం!

... 5వ పేజీ తరువాయి

నమోదుచేశారు. వారిని పిలిచి హెచ్చరించి పంపించేశారు. తాజాగా కొందరు వ్యక్తులు అదే భూముల వద్దకు తాము క్రికెట్ ఆడుకుంటామని, ఆ భూములను లీజుకు ఇవ్వాలని కోరారు. దానికి ప్లాట్ల యజమానులు నిరాకరించారు. ఇది జరిగిన కొద్దిరోజులకే ఆ వ్యక్తులు మరికొందరితో కలిసి వచ్చి అక్కడి భూములను చదునుచేసే ప్రయత్నం చేశారు. స్థానికులు అడ్డుకోవడంతో వెళ్లిపోయారు. కానీ మళ్లీ అదేరోజు రాత్రి వచ్చి ఆ భూముల్లో బోరు వేశారు. ఈ విషయాన్ని బాధితులు వీఎంఆర్‌డీఏ దృష్టికి తీసుకువెళ్లారు. అయితే అక్కడ స్పందన లేకుండా పోయింది. తాజాగా వారు మరో ప్లాటులో ఇంకో బోరు వేశారు. ఈ విషయం తెలిసి అక్కడ ప్లాట్లు కలిగిన యజమానులు మరోసారి పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వుడా భూ సేకరణ చేసి, లేఅవుట్ వేసిన అమ్మేసిన 13 ఏళ్లకు వచ్చి డీపట్టాలు భూములు కొన్నామంటూ ఎటువంటి హక్కు పత్రాలు లేకుండా దందా చేస్తున్నారని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. అదేవిధంగా వీఎంఆర్‌డీఏ అధికారులకూ ఫిర్యాదు చేశారు. వుడా నుంచి వేలం ద్వారా కొన్న భూములకు కూడా రక్షణ కల్పించకపోతే ఎలాగంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయం కాబట్టే ఇలా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఏయూలోనే ఎందుకిలా...

... 5వ పేజీ తరువాయి

ఉంటుంది. నెలలో ఎన్ని రోజులు ఆలస్యంగా వస్తే అంత మొత్తాన్ని మెస్, ఇతర చార్జీలతోపాటు కలిపి చెల్లించాలి. ఈ అదనపు చార్జీలకు సంబంధించి విద్యార్థులు చెల్లించే మొత్తాలకు రశీదులు మాత్రం ఇవ్వరు. అడిగినా స్పందించరు.

భోజనం నాణ్యత అంతంతే...

ఇక హాస్టళ్లలో పెడుతున్న భోజనం నాణ్యత అంతంత మాత్రంగానే ఉంటోందని విద్యార్థులు చెబుతున్నారు. భోజనంలో పురుగులు ఉంటున్నాయని, అన్నం ఒకరోజు గట్టిగా, మరొకరోజు మెత్తగా ఉంటోందని, తినలేక పోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఈ ఇబ్బందులను అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోందని వాపోతున్నారు. మరుగుదొడ్లు, స్నానాల గదులు సరిగా ఉండడం లేదని, ట్యాప్‌లు పనిచేయడం లేదని చెప్పినా మరమ్మతు చేయించడం లేదని ఇంజనీరింగ్ కళాశాల హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థినులు వాపోతున్నారు.

అదనపు బాదుడు నుంచి ఉపశమనం కలిగించాలి

ఆంధ్ర యూనివర్సిటీలో విద్యార్థుల నుంచి మెస్ చార్జీల పేరుతో అదనంగా వసూలుచేస్తున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదు. అందుకే బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టాం. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన చేస్తాం. విద్యార్థులకు మేలు కలిగించేలా వ్యవహరించాల్సిన అధికారులు...దోపిడీ చేసేలా వ్యవహరించడం దారుణం.

- అఖిల్, ఏబీవీపీ

విశాఖ జూకు చేరిన వజ్రపుకొత్తూరు ఎలుగుబంటి

ఆరిలోవ, ఏప్రిల్ 3: శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరు గ్రామంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన ఎలుగుబంటిని అటవీ శాఖ అధికారులు, విశాఖ జూ సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. ఈ ఎలుగుబంటిని మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో విశాఖ జూకు తీసుకువచ్చారు. వెంటనే ఎలుగుబంటికి వైద్య పరీక్షలు చేయగా కొన్ని చోట్ల గాయాలున్నట్టు గుర్తించామని, ప్రస్తుతం జూ. వెటర్నరీ వైద్యుల పర్యవేక్షణలో ఉంచామని జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. ప్రస్తుతానికి తగిన మందులను అందిస్తున్నట్టు తెలిపారు. మరికొన్ని పరీక్షలు చేయవలసి వున్నదని, ఇది ఆడదా? మగదా అని నిర్ధారించ వలసి ఉన్నదని తెలిపారు.

పింఛన్లు ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయాలి

పద్మనాభం(రూరల్), ఏప్రిల్ 3 : లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందించాలని కోరుతూ బుధవారం స్థానిక ఎంపీడీవో బి.శైలజకు టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే అందించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయుకులు కె.దామోదరావు, కాళ్ల నగేష్ కుమార్, కె.లీలావతి, కె. సత్యనారాయణ, గంగరాజు, తదితరలు పాల్గొన్నారు.

వెలిగితే ఆరవు.. ఆరితే వెలగవు

▸ సాగర్‌నగర్, రుషికొండల్లో వీధి దీపాల పరిస్థితి

సాగర్‌నగర్, ఏప్రిల్ 3: గ్రేటర్ విశాఖ 8వ వార్డు సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాలలో వెలిగితే ఆరవు.. ఆరితే వెలగవు అన్న చందాన వీధి దీపాల నిర్వహణ ఉంది. వీధి లైట్లు నిర్వహణ అధ్వానంగా వుందని వార్డులోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా జీవీఎంసీ అధికారులు స్పందించడం లేదు. పలు వీధులలో వీధి దీపాలు వెలగక ఆయా ప్రాంతాలలో అంధకారం నెలకొంది. సాగర్‌నగర్ ఎంఐజి డి-ఎల్‌ఐజి సి మధ్య వున్న రహదారిపై వీధికి చివరలో ఒకటి వెలుగుతోంది. మిగతా వీధిదీపాలు వెలగక రహదారిపై చీకటి ఆవహిస్తోంది. దీంతో ఆప్రాంత ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. విశాఖ వేలి రహదారిలో పగలు ,రాత్రులు వీధి దీపాలు వెలుగుతున్నాయి. వీధి దీపాలను ఆర్పకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో విద్యుత్ వృథా కావడమే కాకుండా నిరంతరం వీధిదీపాలు వెలగడం వలన మరమ్మతుకు గురయ్యాయి.

జూట్‌మిల్లు కల్యాణ మండపంలో పింఛన్లు అందించాలి : సీపీఐ

తగరపువలస, ఏప్రిల్ 03: తగరపువలస చిట్టివలస ప్రాంతాలకు సంబంధించిన పింఛన్లను చిట్టివలస జూట్‌మిల్లు కల్యాణమండపంలో పంపిణీ చేయాలని సీపీఐ సమావేశం డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక జీఆర్ భవన్‌లో సీపీఐ నాయకులు మోర అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పింఛన్ల పంపిణీపై చర్చించారు. వలంటీర్ల ద్వారా పింఛన్లు అందించరాదని ఎన్నికల కమిషన్ నిర్ణయించినందున చాలామంది వృద్ధులు వివిధ ప్రాంతాల్లోని సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోలేరని, అందువల్ల చిట్టివలస జూట్‌మిల్లు కల్యాణ మండలంలో కౌంటర్లను ఏర్పాటు చేసి అధికారులే పంపిణీ చేస్తే ఇబ్బంది ఉండదన్నారు. ఈ విషయంలో అధికారులు పరిశీలన చేయాలని కోరారు ఈ సమావేశంలో మావూరి వీర్రాజు, అల్లం గోవింద, వానపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

98వ వార్డులో పింఛన్ల పంపిణీ

సింహాచలం, ఏప్రిల్ 3: ప్రభుత్వం ప్రతి నెల అందజేస్తున్న వృద్ధాప్యపు, వితంతు, వికలాంగ పింఛన్లు పంపిణీ బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. 98వ వార్డు పరిధిలోని కాపువీధిలో, పాతఅడివివరంలో ఉన్న సచివాలయాలకు వెళ్లడంలో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు.

'అధికారులు వైసీపీ కోడ్‌నే అమలు చేస్తున్నారు'

ఎం.వి.పి.కాలనీ, ఏప్రిల్ 3 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అధికారులు వైసీపీ కోడ్‌నే అమలు చేస్తున్నారని టీఎన్ఎస్ఎఫ్. రాష్ట్ర అధ్యక్షులు ఎంపీ.ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో ఆరోపించారు. తగినంత సిబ్బంది ఉన్నా ఇంటింటికీ పింఛను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇంటికి ఇవ్వకపోవడానికి తెలుగుదేశం పార్టీయే కారణమని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది ఎంతమాత్రం నిజం కాదన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పింఛన్లను ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తున్నారన్నారు. కొన్ని చోట్ల బ్యాంకు నుంచి డబ్బులు రాలేదని వృద్ధులను వెనక్కి పంపించారని పేర్కొన్నారు. మళ్లీ అధికారంలోకి రారని తెలిసే అస్మదీయ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి, ఖజానా ఖాళీ చేశారని ఆరోపించారు.

సినిమా గైడ్

- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని, లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శారద, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్, మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి)
- **ఆడుజీవితం :** శ్రీలీలామహల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఓం భీం బుష్ :** సంగం, కామేశ్వరి, రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజవాక), తాతా (తగరపువలస)
- **ప్రేమలు :** శ్రీకన్య, దుర్గ (మధురవాడ), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 20, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 20, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజ్ 22, క్యారేట్ 26, దొండకాయలు 20, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 24, అల్లం (పాతది) 155, బరబటి 22, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 28, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 165, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 54, ఆగాకర 52, పొటల్స్ 46, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	115
ఫారం ధర	--	135
విత్ స్కిన్	--	240
స్కిన్‌లెస్	--	250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

అప్పన్న తిరుకల్యాణం, చందనోత్సవాలపై ఈవో సమీక్ష


వైదిక అధికారులు, ట్రస్టీలతో చర్చిస్తున్న ఈఓ శ్రీనివాసమూర్తి

సింహాచలం, ఏప్రిల్ 3: ప్రతి ఏడాది సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవం, చందనోత్సవాల నిర్వహణపై ఆలయ వైదిక అధికారులతో దేవస్థానం ఈవో సింగల శ్రీనివాసమూర్తి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు, ప్రధానార్చకులు, పురోహితులతో సుదీర్ఘంగా సమీక్షించి, నాటి అనుభవాలు, వైఫల్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాల సందర్భంగా అనుసరించాల్సిన విధివిధానాలపై అధికారుల సూచనలు, సలహాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కల్యాణం జరుగు స్థలంతోపాటు చందనోత్సవంలో భక్తుల క్యూలు, వారి రాకపోకల మార్గాలు, వాహనాల నియంత్రణ వంటి పలు అంశాలపై ఇంజనీరింగ్ అధికారులతో క్షేత్ర సందర్శన చేసి పలు విషయాలపై చర్చలు జరిపారు. ఈ చర్చల్లో ఆలయ స్థానాచార్యులు డాక్టర్ టీపీ రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహితులు కరి సీతారామాచార్యులు, ఏఈఓ పాలూరి నరసింగరావు, ట్రస్టీ గంట్ల శ్రీనుబాబు, కార్యనిర్వాహక ఇంజనీరు దండు గణ శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులను ఎండలో ఉంచడం భావ్యం కాదు

▸ ఖజానాలో సొమ్ము కాంట్రాక్టర్లకు చెల్లింపు
▸ అందువల్లే పింఛన్ల పంపిణీలో జాప్యం
▸ టీడీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు నిరసన


సచివాలయ సిబ్బందిని నిలదీసిన ఎమ్మెల్యే వెలగపూడి , టీడీపీ నేతలు

ఆరిలోవ, ఏప్రిల్ 3: ప్రతీ నెల వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు చెల్లించాల్సిన సొమ్మును అస్మదీయ కాంట్రాక్టర్లకు ఇవ్వడం వల్లే పింఛన్లు చెల్లించడంలో జాప్యమైందని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆరోపించారు. బుధవారం 13వ వార్డులోని ఆఖరి బస్టాప్ వద్ద గల ఆరో సచివాలయం వద్ద 12వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజుతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెలగపూడి విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వం వద్ద పింఛన్లు ఇవ్వడానికి సొమ్ము లేక ఆ నెపం చంద్రబాబుపై మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సచివాలయానికి వచ్చిన పింఛన్‌దారులకు తాగునీటి సౌకర్యం కల్పించలేదని, టెంటులు వేయలేదన్నారు. ఇలా చేసి చంద్రబాబుపై దుష్ప్రచారం చేస్తున్నారని వెలగపూడి మండిపడ్డారు. అనంతరం వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లను ఇళ్ల వద్దకు తీసుకువెళ్లి అందజేయాలని నినాదాలు చేశారు. ఈ నిరసనలో టీడీపీ 13వ వార్డు కార్యదర్శి యల్లమల్లి సురేష్, క్లస్టర్ ఇన్‌చార్జి బాలస్వామి, 11వ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, 10 వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి మద్ది రాజేష్, గురుమూర్తి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఉసూరుమంటూ వెనుదిరిగిన పింఛనుదారులు

ఆరిలోవ ప్రాంతంలోని 9, 10, 11, 12, 13 వార్డులకు చెందిన పలువురు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ల కోసం సచివాలయాలకు బుధవారం ఉదయం వచ్చి ఇవ్వడం లేదని కార్యదర్శులు చెప్పడంతో ఉసురుమంటూ వెనుదిరిగారు. బుధవారం ఉదయం నుంచి పింఛన్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పింఛన్‌దారులు సచివాలయాకు వచ్చారు. పింఛన్లు ఏవీ ఇంత వరకు రాలేదని సచివాలయాల సిబ్బంది చెప్పడం వారంతా తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత పింఛన్ల పంపిణీ ప్రారంభించడంతో కొంతమంది వచ్చి తీసుకున్నారు.

ప్రత్యర్థుల మాయమాటలను నమ్మకండి : ముత్తంశెట్టి


అప్పికొండ వీధిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు


ప్రచారం చేస్తున్న బొత్స ఝాన్సీ, ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఏప్రిల్ 3: ఎన్నికల సమయంలో చాలామంది మాయమాటలు చెబుతూ, ఏవేవో పంపకాలు చేస్తారని, వారి ప్రలోభాలకు లొంగిపోవద్దని వైసీపీ భీమిలి అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రజలను కోరారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా అప్పికొండవీధి, తోటవీధి, మేదరవీధి, చిన్నబజారు ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యర్థి గంటా శ్రీనివాసరావు కేవలం ఎన్నికల సమయంలోనే కనబడతారని, తర్వాత మీకు కాదు.. ఆ పార్టీ నాయకులకు కూడా కనీసం బ్రేక్ దర్శనం కూడా దొరకదన్నారు. ఈ విషయం ఆ పార్టీ నాయకులకు కూడా తెలుసునని, ఇది నిజం అని అన్నారు. 2019లో ఇక్కడి నుంచి వెళ్లిపోయిన తర్వాత ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన తర్వాత ఆ నియోజకవర్గంలో ఐదేళ్లలో ఐదుసార్లు కూడా పర్యటించలేదన్నారు. తాను, తన వెనకాల పది కార్లేసుకుని ఫేక్ హైప్‌ను సృష్టించుకుని ప్రజలను నమ్మిస్తారన్నారు. నిత్యం మీ మధ్య వుండి.. మీ సమస్యలు పరిష్కరించే తనకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా తోటవీధిలో పది మంది జనసేన యువకులు ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీలో చేరారు. ఈ ప్రచారంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు, గుండాసు మధునాయుడు, ఎర్నింటి అచ్చిబాబు, బోని సంజీవరావు, సంకురుబోతు రమేష్, కర్రోతు నాగేంద్ర, చెల్లూరి గౌరినాయుడు, రాకోతు నరసింగరావు, అల్లిపిల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వైసీపీ ఎన్నికల ప్రచారం

ఆనందపురం, ఏప్రిల్ 4: మండలంలో బుధవారం వైసీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని శొంఠ్యాం, గండిగుండం పంచాయతీల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అభివృద్ధికి ఓటు వేయాలని కోరారు. గత ఐదేళ్లుగా బడుగు, బలహీన వర్గాల ఇంటికి ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రతిపక్షాలు అనేక విమర్శలు చేస్తున్నాయని, వాటిని పట్టించుకోకుండా వైసీపీకి ఓటు వేయాలని కోరారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ ప్రతీ ఇంటికి పథకాన్ని అందించి, ప్రజలు గుండెల్లో జగన్ నిలిచారన్నారు. పని చేసే వ్యక్తిని ఆదరించి, అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయుకులు బంక సత్యం, గంగ్రెడ్డి శ్రీను, కోరాడ వెంకటరావు, మజ్జి వెంకటరావు తదితరలు పాల్గొన్నారు.

అప్పన్న ఆర్జిత సేవలు పునఃప్రారంభం


తులసీదళార్చన చేస్తున్న అర్చకులు

సింహాచలం, ఏప్రిల్ 3: వరాహలక్ష్మీనృసింహస్వామివారి ఆర్జిత సేవలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. గడచిన మార్చి 26న ప్రారంభమై ఏప్రిల్ 1తో ముగిసిన సుదర్శన నారసింహ మహాయజ్ఞం సందర్భంగా అప్పన్నకు జరగాల్సిన ఆర్జిత సేవలన్నింటినీ రద్దు చేశారు. మహాయజ్ఞం పరిసమాప్తం కావడంతో బుధవారం వేకువజామున సుప్రభాత సేవతో ఆర్జిత సేవలన్నింటిని తిరిగి యథావిధిగా నిర్వహించారు. వాటిలో భాగంగా సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలపి ప్రభాతారాధనలు జరిపి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. నృసింహ సహస్ర నామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో అర్చించారు. తరువాత అదే వేదికపై ఉదయం 9.30 గంటలకు ఆర్జిత నిత్యకల్యాణాన్ని పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

సింహాచలంలో తరచూ ట్రాఫిక్ జామ్‌లు


నిలిచిన వాహనాలు

సింహాచలం, ఏప్రిల్ 3: ప్రతినిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగించే సింహాచలం గోశాల కూడలి నుంచి పాతఅడివివరం కూడలి వరకు ఇటీవల తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ పనులు ఇటీవల వేగవంతం చేసే ప్రక్రియలో ఈ రెండు కిలోమీటర్ల నిడివి గల మార్గంలో రోడ్డుకు ఇరువైపులా పెద్దఎత్తున తవ్వకాలు చేపట్టారు. కాలువల నిర్మాణానికి కావలసిన సామగ్రి రోడ్డుకు ఇరువైపులా వేయడంతో రెండు వాహనాలు మాత్రమే వెళ్లేందుకు అవకాశం ఉంది. దీంతో ఒక ద్విచక్ర వాహనం ఓవర్‌టేక్ చేసేందుకు యత్నించినా ట్రాఫిక్ స్తంభించే పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా బుధవారం ఉదయం 8గంటల నుంచిమధ్యాహ్నం 3గంటల వరకు ఈ మార్గంలో అనేకమార్లు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డు నిర్మాణం సత్వరం పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని భక్తులు, వాహనదారులు కోరుతున్నారు. లేకుంటే రానున్న రోజుల్లో అప్పన్నస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవం, నిజరూపదర్శనం చందనోత్సవం వంటి మహోత్సవాల వేళ ఇబ్బందులు ఎదుర్కొంటామని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

సాగర్‌నగర్, రుషికొండల్లో పింఛన్ల పంపిణీ

సాగర్‌నగర్, ఏప్రిల్ 3: సాగర్‌నగర్, రుషికొండ, తదితర సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైంది. పింఛన్లు పంపిణీ చేస్తున్నారనే విషయం కొంతమంది వృద్ధులకు తెలియక సచివాలయాలకు రాలేకపోయారు. సచివాలయాలలోని సెక్రటరీలు పింఛన్లను పంపిణీ చేశారు.

చిల్లపేటలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న జడ్సీ


చిల్లపేటలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న జోనల్ కమిషనర్

తగరపువలస, ఏప్రిల్ 3: పింఛన్లను ప్రతి సచివాలయ పరిధిలో మూడు కౌంటర్లను ఏర్పాటు చేసి పంపిణీ చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత బ్యాంకు నుంచి నగదు తీసుకున్న అనంతరం ఈ కార్యక్రమం మొదలైంది. ఈ కౌంటర్ల దగ్గరికి రాలేని వృద్ధులకు చిల్లపేటలో భీమిలి జోనల్ కమిషనర్ ఎ.కనకమహాలక్ష్మి స్వయంగా వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమం గురువారం కూడా కొనసాగుతుందని అధికారులు చెప్పారు.

టీడీపీ సమావేశాన్ని అడ్డుకున్న ఎన్నికల కోడ్ సిబ్బంది


టీడీపీ నాయకుల సమావేశాన్ని నిలిపివేయాలని చెబుతున్న ఎన్నికల సిబ్బంది

పద్మనాభం, ఏప్రిల్ 3 : భీమిలి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు నిర్వహించే ఎన్నికల ప్రచారంపై రూట్‌మ్యాపు తయారు చేసుకోవడానికి సమావేశమైన టీడీపీ మండల నాయకులను ఎన్నికల కోడ్ సిబ్బంది బుధవారం అడ్డుకున్నారు. సొంత స్థలంలో సమావేశం పెట్టుకున్నా.. ఐదు మందికి మించి సమావేశమైతే అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేనిదే ఈ సమావేశం నిర్వహించకూడదని వారు తెలిపారు. దీంతో టీడీపీ నాయకులు ఈ సమావేశాన్ని నిలిపివేశారు. అనంతరం తమకు తెలిసిన వారి ఇంటి వద్ద సమావేశమై ఎన్నికల ప్రచారం నిర్వహణపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలి : టీడీపీ

పద్మనాభం, ఏప్రిల్ 3 : మండలంలోని పింఛనుదారులకు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు కోరారు. సచివాలయ ఉద్యోగులను ప్రతీ ఇంటికీ పంపించి పింఛన్ల బట్వాడా చేయాలని వారు కోరారు. ఈమేరకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.రమణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.లీలావతి, టీడీపీ నాయకులు నగేష్‌కుమార్, నందీశ్వరరావు, గంగరాజు, పైడినాయుడు, పావని తదితరులు పాల్గొన్నారు.

16వ వార్డులో జయహో బీసీ


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 3: తూర్పు నియోజకవర్గంలోని 16వ వార్డులో బుధవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే బీసీలకు కొత్తగా ప్రవేశ పెట్టబోయే పథకాలను వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే భవిష్యత్తు గ్యారెంటీ పథకాల కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల వలన రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, శ్రీభరత్‌ని ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా రజక కాలనీ, అంబేద్కర్‌కాలనీ, రామాలయం వీధి, రెల్లి వీధి తదితర ప్రాంతాలలో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నారు గోపి, నాయకులు మొల్లి శంకర్, పల్లా ఉమారాణి, ముగడ వాసు, మొల్లి శోభ, జి.అప్పన్న, 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, మళ్ల రవికుమార్, ఆర్.నూకరాజు, పి.శ్రీను, షేక్ మదర్, కమల్, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం : ఎంవీవీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీవీ సత్యనారాయణ

విశాలాక్షినగర్, ఏప్రిల్ 3: అభివృద్ధి, సంక్షేమం ప్రామాణికంగా వైసీపీ పాలన సాగిందని వైసీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని జోడుగుళ్లపాలెంలో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ 9వ వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిచ్చి రోడ్లు, డ్రైనేజీలు, వ్యూ పాయింట్ ఆధునికీకరణ పనులను చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ స్వాతిదాస్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

8,078 మందికి పింఛన్లు పంపిణీ

పద్మనాభం(రూరల్), ఏప్రిల్ 3 : మండలంలో 22 పంచాయతీల్లో వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, తదితర 8,078 మంది లబ్ధిదారులకు బుధవారం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో బి.శైలజ తెలిపారు. వివిధ గ్రామాల్లో ఉన్న సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. దివ్యాంగులు, వృద్ధులకు గురువారం ఇళ్ల వెళ్లి పింఛన్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆమె తెలిపారు.

శ్రీచైతన్యలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

మధురవాడ, ఏప్రిల్ 3: స్థానిక బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఐదో తరగతి నుంచి ఆరో తరగతిలో ప్రవేశించే విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రదర్శనను కనపరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలను పాఠశాల యాజమాన్యం అందించింది. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర కాకినాడ జోన్ శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సురేష్, అహ్మద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

కప్పస్తంభం ఆదాయం రూ.7.9 లక్షలు

సింహాచలం, ఏప్రిల్ 3: వరాహలక్ష్మీనృసింహస్వామి ఖజానాకు ఆలయ కప్పస్తంభ ఆలింగనాల ద్వారా రూ.7.9లక్షల ఆదాయం సమకూరింది. బేడామండపంలో రాతిస్తంభానికి దిగువ భాగాన ఉన్న ప్రత్యేక స్తంభాన్ని భక్తులు ఆలింగనం చేసుకోవడం వలన సత్వరం సంతానం కలగడంతోపాటు తమ కోర్కెలు స్వామి తీరుస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అదే క్రమంలో గడచిన మార్చి నెల మొత్తం మీద కప్పస్తంభ ఆలింగనం టికెట్లు రూ.25లు విక్రయాలు ద్వారా అప్పన్నస్వామి ఖజానాకు రూ.7,95,625లు ఆదాయం వచ్చినట్టు ఆలయ గణాంకాలు చెబుతున్నాయి.

వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు


జీవీఎంసీ ఉద్యోగికి రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

భీమునిపట్నం, ఏప్రిల్ 3: జీవీఎంసీ భీమిలి జోన్ 3వ వార్డుకు చెందిన వలంటీర్లు రాంభుక్త ప్రభాకర్‌నాయుడు, కొంకి వెంకటేష్, అప్పికొండ బాలకృష్ణ, సుంకర వెంకటరత్నం, కాసారపు ప్రసాద్, వాడ మొదల వెంకటలక్ష్మి రాజీనామాలు చేశారు. బుధవారం రాజీనామా లేఖలను జోనల్ కార్యాలయం ఉద్యోగి సి1 గోవింద్‌కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావులను అఖండ మెజారిటీతో గెలిపించుకోవాలనే ఉద్దేశంతో రాజీనామాలు చేశామన్నారు. ఎన్నికల్లో వైసీపీకి మద్దతుగా ప్రచారం చేస్తామన్నారు.

రూమర్లు పట్టించుకోవద్దు : ఎంపీపీ

భీమునిపట్నం, ఏప్రిల్ 3: టీడీపీ నాయకులు పుట్టిస్తున్న వదంతులను నమ్మవద్దని ఎంపీపీ డీవీఎస్ఎస్ఎన్ రాజు(వాసురాజు) ప్రజలను కోరారు. బుధవారం అవంతి క్యాంప్ ఆఫీసులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జడ్పీటీసీ సభ్యుడు మొన్న చేరారని, రేపోమాపో ఎంపీపీ చేరిపోతున్నారని, భీమిలి మండలంలో వైసీపీ ఖాళీ అయిపోతుందని రూమర్లు సృష్టిస్తున్నారన్నారు. మీ ఎంపీపీ కూడా వచ్చేస్తున్నారు.. మీరు కూడా వచ్చేయండి అంటూ అసత్యపు ప్రచారంతో నాయకులను ప్రలోభపెడుతున్నట్టు తెలిసిందన్నారు. 2019 ఎన్నికల్లో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు ఆయన అనుయాయులు తమ పార్టీలో లేరని, ఆ ఎన్నికల్లో భీమిలి మండలం నుంచి వైసీపీకి 2,500 ఓట్లు ఆధిక్యత ఇచ్చామని, ఈ సారి ఐదువేల ఆధిక్యతను అందిస్తామన్నారు. వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైసీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను మాట్లాడుతూ, స్వార్థపూరిత ఆలోచనలతో టీడీపీ నుంచి 2019 ఎన్నికల తర్వాత గాడు వెంకటప్పడు, పలువురు వైసీపీలో చేరారన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, దాకమర్రి ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్‌బాబు, గుండాసు మదునాయుడు పాల్గొన్నారు.

రేపు ఎండాడలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎండాడ, ఏప్రిల్ 3: ఎండాడ సబ్ స్టేషన్ పరిధిలోని వరహగిరినగర్ ఫీడర్ ప్రాంతంలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఎండాడ బీసీ కాలనీ, వరహగిరినగర్, ఎండాడ పెట్రోల్ బంక్ శిరుగుడినగర్, వివేకానందనగర్, దసపల్లా లేఅవుట్ ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

'నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి'

భీమునిపట్నం, ఏప్రిల్ 3: భీమిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ డీవీఎస్ఎస్ఎన్ రాజు(వాసురాజు) అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో వున్నందున ఎటువంటి సమీక్షలు, తీర్మానాలు చేసేందుకు అవకాశం లేనందున వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే విద్యుత్తు శాఖాధికారులకు కూడా కరెంటు సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జానకి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోని బంగారునాయుడు, ఏఎంసీ ఛైర్మన్ ఎలమంచలి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.